# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 48 | విశాఖపట్నం | 18-11-2025 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 48 | VISAKHAPATNAM | 18-11-2025 TUESDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-







## సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో

# 45 మంది హైదరాబాదీలు మృతి

**హైదరాబాద్, పతాకం న్యూస్:** సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాద్ వాసులు మరణించినట్లు తెలంగాణ హజ్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లిన వీరి ప్రయాణం విషాదాంతంగా ముగిసింది. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఉండటం అందరినీ తీవ్రంగా కలచివేస్తోంది. ఈ దుర్ఘటనతో హైదరాబాద్ నగరంలో, ముఖ్యంగా మృతుల కుటుంబాల్లో తీరని విషాదం అలుముకుంది. సోమవారం తెల్లవార జామున మక్కాలో ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని, మదీనా నగరానికి బస్సులో బయలుదేరారు. మదీనా నగరానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండగా, వీరు ప్రయాణిస్తున్న బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఓ డీజిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. ఈ భయానక ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న మొత్తం 45 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నారని హజ్ కమిటీ అధికారులు తమ ప్రకటనలో వివరించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 18 మంది హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం ఈ విషాద తీవ్రతను రెట్టింపు చేసింది. రిటైర్డ్ రైల్వే ఉద్యోగి అయిన నజీరుద్దీన్, తన కుటుంబ సభ్యులందరితో కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ యాత్రకు వెళ్లారు. మక్కాలో ప్రార్థనలు ముగించుకుని మదీనాకు వెళ్లే మార్గమధ్యంలో వారి కుటుంబంపై విధి ఇలా పగబట్టింది. ఒకేసారి కుటుంబంలోని 18 మందిని



కోల్పోవడంతో వారి బంధువులు, స్థానికులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఈ యాత్రను హైదరాబాద్‌కు చెందిన నాలుగు ట్రావెల్ ఏజెన్సీలు నవంబర్ 9వ తేదీన ఏర్పాటు చేశాయి. ప్రమాద వార్త తెలియగానే సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. సౌదీ అధికారులు ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ విషాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి, పలువురు కేంద్ర మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహాలను వీలైనంత త్వరగా హైదరాబాద్‌కు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒకే నగరం నుంచి, ముఖ్యంగా ఒకే కుటుంబం నుంచి ఇంత పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం హైదరాబాద్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది.

## తమిళనాడు సీఎం సహా పలువురు ప్రముఖుల ఇళ్లకు

# బాంబు బెదిరింపులు




**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సహా పలువురు సినీ ప్రముఖుల ఇళ్లకు బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం సృష్టించింది. దీంతో బాంబు స్క్వాడ్, పోలీసులు అప్రమత్తమై తనిఖీలు చేయగా.. అది ఫేక్ బెదిరింపు అని నిర్ధారణ అయింది. వివరాల ప్రకారం.. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్, నటులు అజిత్ కుమార్, అరవింద్ స్వామి, ఖుష్బు నివాసానికి ఆదివారం రాత్రి బాంబు బెదిరింపు వచ్చింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) కార్యాలయానికి బెదిరింపు ఈ-మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సిఎం నివాసం సహా నాలుగు ప్రదేశాలలో భద్రతా తనిఖీలు చేపట్టారు. ఇళ్లు, పరిసర ప్రాంతాలలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. కొన్ని గంటల పాటు సోదాలు జరిగాయి. ఈ తనిఖీల్లో ఎటువంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో అది ఫేక్ మెయిల్ అని పోలీసులు నిర్ధారించారు. బెదిరింపు పంపిన వ్యక్తి గురించి ఎలాంటి వివరాలను అధికారులు వెల్లడించలేదు.

## దొంగలు దొరికిపోతారనే భయంతోనే సతీష్ కుమార్‌ను

# అంతమొందించారు: పార్థసారథి



**అమరావతి, పతాకం న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరకామణిలో జరిగిన రూ.100 కోట్ల విదేశీ కరెన్సీ చోరీ కేసులో దొంగలు దొరికిపోతారనే భయంతోనే నాటి విజిలెన్స్ అధికారి సతీష్ కుమార్‌ను అంతమొందించారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల పవిత్రతను మంటగలిపి, దోపిడీకి పాల్పడ్డారని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్లాది మంది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల (తరువాయి 2వ పేజీలో)

## ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్ట్‌లో సజ్జనార్ బృందానికి

# పవన్ అభినందనలు



**అమరావతి, పతాకం న్యూస్:** ప్రముఖ పైరసీ వెబ్‌సైట్లు 'ఐబొమ్మ', 'బప్పం టీవీ' నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్ట్ చేసిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులను, నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌ను ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. చిత్ర పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగిస్తున్న పైరసీపై ఉక్కుపాదం మోపడం స్వాగతించదగ్గ పరిణామమని ట్వీట్ చేశారు. "సినిమా పైరసీ ముఠాను అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులకు, సిటీ కమిషనర్ వీసీ సజ్జనార్‌కి అభినందనలు. డబ్బుల రూపంలోనే కాదు, సృజనాత్మకతనూ పెట్టుబడిగా పెట్టి నిర్మించే సినిమాలను విడుదలైన రోజునే ఇంటర్నెట్ లో పోస్ట్ చేస్తున్న ముఠాల వల్ల చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోంది. సినిమా విడుదలే ఒక మహా యజ్ఞంగా మారిపోయిన తరుణంలో పైరసీ ముఠాలను కట్టడి చేయడం దర్శకనిర్మాతలకు సాధ్యం కావడం లేదు. పైరసీలో కీలకంగా ఉన్న ఐబొమ్మ, బప్పమ్ వెబ్ సైట్ల నిర్వాహకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, అతనితోనే వాటిని మూయించివేయడం స్వాగతించదగ్గ పరిణామం. పోలీసులకు సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు వచ్చిన తరుణంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసు బృందం చేసిన ఆపరేషన్ విజయవంతమైంది. ఈ ఆపరేషన్లో భాగమైన పోలీసులకు, సిటీ కమిషనర్ వీసీసజ్జనార్ కు అభినందనలు తెలియచేస్తున్నాను. బెట్టింగ్ మాఫియా, పొంజీ స్కీమ్స్ లాంటివాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, వాటి వల్ల ప్రజలు ఏ విధంగా ఆర్థికంగా చితికిపోతున్నారో సజ్జనార్ చైతన్యపరుస్తున్నారు. ఆయనతో ఓ సందర్భంలో సమావేశమైనప్పుడు పొంజీ స్కీమ్స్ మూలంగా ప్రజలు ఆర్థికంగా ఏ విధంగా మోసానికి గురై నష్టపోతున్నారో వివరించారు. అలాగే బెట్టింగ్ యాప్స్ ను నియంత్రించేందుకు సజ్జనార్ చేపట్టిన కార్యక్రమం అన్ని రాష్ట్రాల్లోనూ కదలిక తీసుకువచ్చింది. ఆయన నేతృత్వంలో చేపట్టే చర్యలు కచ్చితంగా తెలుగు సినిమాకే కాదు యావత్ భారతీయ చిత్ర పరిశ్రమకు మేలు చేస్తాయి" అని పవన్ కల్యాణ్ వివరించారు.



## షేక్ హసీనాకు మరణశిక్ష

ఢాకా కోర్టు సంచలన తీర్పు

2లో



గ్రావెల్ కనబడితే చాలు..

## వాలిపోతున్న అక్రమార్కులు

5లో

# స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గం సమావేశమైంది. ఈ సమావేశంలో ప్రజాపాలన వారోత్సవాలు, సౌదీ అరేబియా ప్రమాదంలో మరణించిన వారికి పరిహారం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో, డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.






పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## దుర్భర దారిద్ర్య నిర్మూలనకు నూతన మార్గాలు

కేరళ ప్రభుత్వం చేపట్టిన దుర్భర దారిద్ర్య నిర్మూలనా పథకం (ఇ.పి.ఇ.పి) ప్రభుత్వ జోక్యాన్ని పునర్‌నిర్వచించింది. ఈ పథకం అంతర్జాతీయ నమూనాగా రూపొందే అవకాశమూ ఉన్నది. అన్నిటికన్నా ముఖ్యంగా పేదరికాన్ని గుర్తించి, దాని పరిష్కారానికి కృషి చేసేందుకు అవసరమైన నూతన పద్ధతులను ఈ పథకం వెల్లడించింది. సమ్మిళిత అభివృద్ధిని సాధించడానికి పెట్టుకున్న తొలి దశ, మలి దశ లక్ష్యాలను దాదాపుగా పూర్తి చేశాక పేదరిక నిర్మూలనలో స్థానిక సంస్థలను, కమ్యూనిటీలను, అభివృద్ధి ఏజెన్సీలను భాగస్వాములుగా చేసి%% నిరంతర పర్యవేక్షణ ద్వారా వాటి తోడ్పాటును ఎలా ఉపయోగ పెట్టుకోవాలనేది కేరళ ప్రభుత్వం ఆచరణాత్మకంగా చేసి చూపింది. పేదరికాన్ని తగ్గించడానికి కేరళ ప్రభుత్వం ఎంచుకున్న మార్గం పేదరికం నుండి బయట పడేయడానికి దేశంలో అమలు చేస్తున్న సంప్రదాయ పద్ధతులకు భిన్నమైనది. కొన్ని దశాబ్దాల క్రితమే చేపట్టిన భూసంస్కరణల అమలు, సార్వజనీన ప్రాథమిక విద్యాకల్పన, సార్వజనీన ప్రజాపంపిణీ వ్యవస్థలు ప్రజల జీవనోపాధికి రక్షణ కల్పించడంలో బలీయమైన ప్రభావం చూపించాయి. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ద్వారా స్థానిక సంస్థలకు స్థానిక అవసరాలకు అనుగుణంగా అనేకానేక ప్రాజెక్టులు అమలు చేసుకునే అధికారాలు దక్కాయి. దీనితోపాటు స్వయం సహాయక బృందాల (ఎస్.హెచ్.జి) పథకాన్ని పోలిన కుటుంబశ్రీ పథకం మహిళా సాధికారిత కల్పించడంతో పాటు దారిద్ర్య నిర్మూలనలో కూడా ఎంతగానో తోడ్పడింది. 1973-74 నాటికి కేరళలో 59.74 శాతంగా ఉన్న పేదరికం 2011-12 నాటికి 11.3 శాతానికి తగ్గింది. దేశంలో అత్యంత కనిష్ట పేదరికం ఉన్న రాష్ట్రం కేరళ అని నీతి ఆయోగ్ ప్రకటించింది. నీతి ఆయోగ్ రూపొందించిన బహుముఖ దారిద్ర్య సూచిక (యం.పి.ఐ)ను అనుసరించి కేరళలో 2015-16 నాటికి 0.70 శాతంగా ఉన్న పేదరికం 2019-21 నాటికి 0.55 శాతానికి తగ్గుముఖం పట్టింది. దుర్భర పేదరిక నిర్మూలనలో కేరళ ప్రభుత్వం అగ్రస్థానంలో ఉన్నప్పటికీ ఇంకా అక్కడక్కడా ఈ పేదరికం కొనసాగుతున్నది. దీనికిగల మూల కారణాలను అన్వేషించి అందుకు తగిన పథకాలు రూపొందించాల్సిన అవసరం ఉన్నది. యం.పి.ఐ చట్రం పరిధిలో దుర్భర పేదరికానికి దారితీసిన కారణాలను ప్రత్యక్ష భాగస్వామ్య పద్ధతిలో గుర్తించారు. పూర్తి అనారోగ్యం, అంగవైకల్యం, వయసు మళ్ళడం, ఆహారం, నిలవ నీడ, జీవనోపాధి వంటి కనీసం అవసరాలు మృగ్యం కావడం, పిల్లలలో తీవ్ర పౌష్టికాహార లోపం వంటివన్నీ దుర్భర పేదరికానికి ప్రమాణంగా పరిగణించారు. చారిత్రికంగా సమాజ విస్మరణకు గురయి పేదరికంలో మగ్గిపోతున్న ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార తరగతి ప్రజానీకం, హెచ్ఐవి పీడితులు, అనాథలు, యల్.జి.బి.టి.క్యు.ఐ.ఎ తరగతికి చెందినవారిని, పట్టణ పేదలను గుర్తించారు. కుటుంబశ్రీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారగణం, స్థానికులతో కూడిన కమిటీలు స్థానిక సంస్థల సహకారంతో ఇంటింటి సర్వే చేపట్టి దుర్భర పేదరికంలో ఉన్నవారిని గుర్తించారు. ఇలా 1,18,309 కుటుంబాలను గుర్తించిన మీదట స్థానిక సంస్థలు 87,158 కుటుంబాలకు తగిన సాయం అందించాలని ప్రభుత్వానికి నివేదించాయి. మొబైల్ అప్లికేషన్ల ద్వారా ఈ కుటుంబాలను ఇంటర్వ్యూ చేసిన మీదట 73,747 కుటుంబాలను అత్యంత ప్రాధాన్యతా క్యాటగిరీ కింద వర్గీకరించారు. ఈ జాబితాను గ్రామ సభల ఆమోదానికి పంపారు. అనర్హులను తప్పించి 64,006 కుటుంబాలు దుర్భర పేదరికంలో మగ్గుతున్నట్లు గ్రామసభలు నిర్ణయించాయి. కేరళ ప్రభుత్వం అమలు చేసిన ఇ.పి.ఇ.పి పథకంలో వున్న సృజనాత్మక అంశం ఏమంటే అందరికీ ఒకే సంక్షేమ పథకం అని కాకుండా%% ఏ కుటుంబానికి తగినట్లుగా ఆ సంక్షేమ పథకాన్ని రూపొందించడం. ఈ పథకాన్ని తక్షణ పథకం, మధ్యంతర పథకం, దీర్ఘకాలిక పథకం పేరిట మూడు దశలుగా విభజించారు. తక్షణ పథకం కింద ఆహారం, వైద్య అవసరాలు తీర్చడంతోపాటు సామాజిక భద్రతా పథకాలకు అర్హులుగా గుర్తించే డాక్యుమెంట్లు అందించారు. మధ్యంతర పథకం కింద వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు, స్వావలంబనకు తగిన చర్యలు చేపట్టారు. తాత్కాలిక ఆవాసం కల్పించారు. దీర్ఘకాలిక పథకం కింద శాశ్వత నివాస గృహాలు అందించడంతో పాటు జీవనోపాధికి తగిన సాయం అందించారు. ఇవన్నీ నిర్దిష్ట కాలపరిమితిలో అందరికీ అందేలా చూడడంతో పాటు అందుకు జవాబుదారీతనాన్ని కూడా నిర్దేశించారు.

## విజయవంతమైన మెడికల్ రిప్స్ ముంబై ఆందోళన




**కాకినాడ, పతాకం న్యూస్:** తమ సమస్యల పరిష్కారానికై ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ముంబై ఆజాద్ మైదాన్ లో సోమవారం జరిగిన ఆందోళన విజయవంతమైనట్లు ఏ.పి.ఎం.ఎస్.ఆర్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. వెంకట్రావు, కోశాధికారి దుంపల ప్రసాద్, కాకినాడ బ్రాంచ్ కార్యదర్శి ఎ.ఆర్.సి. వర్మ లు తెలిపారు. కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, మెడికల్ రిప్స్ పై మందుల కంపెనీల వేధింపులు అరికట్టాలని, నిర్దిష్టమైన పని పద్ధతులు అమలు చేయాలని, వ్యక్తిగత గోప్యత కు భంగం కలిగించే విధానాలు ఆపాలని ఈ ధర్నాలో వక్తలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976 వచ్చి వచ్చే సంవత్సరానికి 50 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా ఉద్యోగ భద్రత కొరకు మరిన్ని పోరాటాలకు మెడికల్ రిప్రజెంటేటివ్స్ సిద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చినట్లు తెలిపారు. దక్షిణ, పశ్చిమ భారత దేశంలో వివిధ రాష్ట్రాల నుండి సుమారు 5 వేల మంది మెడికల్ రిప్స్ ఈ ఆందోళన లో పాల్గొన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో కూడా తూర్పు, ఉత్తర భారతదేశ రాష్ట్రాల మెడికల్ రిప్స్ ఆందోళన చేయడం జరుగుతుందన్నారు. ముంబై లో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ బ్రాంచ్ నాయకులు రామకృష్ణ, షంషుద్దీన్, వెంకటేష్, శేఖర్, శ్యామ్, దుర్గా ప్రసాద్, నరేష్, కిశోర్, కె .టి. అప్పారావు, రామ్మోహన్, భాస్కర్, రామ్మూర్తి, ఇమ్మాన్యుయేల్, వాసుదేవ్, శ్రీధర్, కె. అప్పారావు , లతో పాటు సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## షేక్ హసీనాకు మరణశిక్ష... ఢాకా కోర్టు సంచలన తీర్పు



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో గత సంవత్సరం జరిగిన అల్లర్ల కేసులో దోషిగా తేలిన మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పును వెలువరించింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారన్న అభియోగాల నేపథ్యంలో ఆమెపై పలు కేసులు నమోదయ్యాయి. వాదనలు విన్న ట్రైబ్యునల్ ఆమెను దోషిగా తేల్చింది. అనంతరం ఆమెకు మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. గత సంవత్సరం రిజర్వేషన్ల కోసం జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారి అవామీ లీగ్ గద్దె దిగడానికి కారణమైంది. ఆందోళనకారుల బారి నుంచి తప్పించుకోవడానికి షేక్ హసీనా ప్రత్యేక విమానంలో భారత్‌కు వచ్చారు. ఏడాదికి పైగా ఆమె ఢిల్లీలోని గుర్తు తెలియని ప్రాంతంలో తలదాచుకుంటున్నారు. ఇలాంటి సమయంలో ఆమెకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించింది. తనపై జరిగిన సుదీర్ఘ విచారణను ఇటీవల షేక్ హసీనా న్యాయశాస్త్రంలో ఒక జోక్‌గా అభివర్ణించారు. షేక్ హసీనా పాలన ముగిసి, తాత్కాలిక యూనస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో రాజకీయ గందరగోళం నెలకొంది. 2026 ఫిబ్రవరిలో సాధారణ ఎన్నికలు జరగాల్సి ఉన్న తరుణంలో రాజకీయంగా అస్థిరత నెలకొంది.

## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచీ తరచూ 300 నుంచి 400 దాటుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమని పేర్కొంది. కాలుష్యం నేపథ్యంలో రాజధానిలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని స్పష్టం చేసింది. ఢిల్లీలో వేగంగా పెరుగుతున్న కాలుష్య సమస్యను అరికట్టేందుకు నిర్మాణాలపై నిషేధం విధించడం వంటి సంచలన ఆదేశాలు ఇచ్చేందుకు సుముఖంగా లేమని ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది. ఈ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించే లక్ష్యంగా నవంబర్ 19లోగా ఒక ప్రణాళికతో రావాలని కేంద్రాన్ని ఆదేశించింది. తాత్కాలిక పరిష్కారాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని, దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలని సూచించింది.

## సౌదీ బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం... సౌదీకి అజారుద్దీన్ బృందం

**హైదరాబాద్, పతాకం న్యూస్:** సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం రూ. 5 లక్షల పరిహారం అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంత్రివర్గం తీర్మానించింది. మక్కా నుంచి మదీనాకు యాత్రికులను తీసుకువెళుతున్న బస్సుకు ప్రమాదం జరిగిన దుర్ఘటనలో 45 మంది మృతి చెందిన విషయం విదితమే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. ప్రభుత్వ ప్రతినిధి బృందంగా మంత్రి అజారుద్దీన్, మజ్లిస్ ఎమ్మెల్యే, మరియు మైనార్టీ విభాగానికి చెందిన ఒక అధికారి వెంటనే సౌదీ అరేబియాకు వెళ్లాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. మరణించిన వారి కుటుంబ సభ్యుల అభీష్టం మేరకు మృతదేహాలను అక్కడే మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించడానికి, ఒక్కో బాధిత కుటుంబం నుంచి ఇద్దరు కుటుంబ సభ్యులను సౌదీ అరేబియాకు తీసుకువెళ్లడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగిస్తే పాకిస్థాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాలి: ఉపేంద్ర ద్వివేది




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్న ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగిస్తే పాకిస్థాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. ఉగ్రవాదులను, వారికి మద్దతిచ్చే వారిని భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో వ్యవహరించే విషయంలో భారత ప్రభుత్వం కొత్త విధానాలను అనుసరిస్తున్నట్లు తెలిపారు. ఉగ్ర ముఠాలను ఎగదోయడం మానకపోతే పాకిస్థాన్ అస్థిత్వమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపై దృష్టి పెడుతుందని అన్నారు. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, దీటుగా స్పందిస్తుందని స్పష్టం చేశారు. పాకిస్థాన్ కు ఇప్పటికే ఆపరేషన్ సిందూర్ ద్వారా 88 గంటల ట్రైలర్ చూపించామని, ఇకపై పూర్తి సినిమా చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాల ఉనికి గురించి ప్రపంచానికి ఆధారాలను అందించినట్లు తెలిపారు. చర్చలు, ఉగ్రవాదం ఎన్నటికీ కలిసి సాగవని, రక్తం, నీరు కలిసి ప్రవహించబోవని పాకిస్థాన్‌కు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. బ్లాక్‌మెయిళ్లకు పాల్పడే పరిస్థితుల్లో భారత్ లేదని, శత్రువులను ఎదుర్కోవడానికి దేశంలోని నేతలంతా ఏకతాటిపై పనిచేస్తున్నారని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో పరిస్థితి మెరుగుపడినట్లు చెప్పారు. చైనాతో సంబంధాలపై కూడా ఉపేంద్ర ద్వివేది స్పందించారు. ఇంతకుముందుతో పోలిస్తే చైనాతో సంబంధాలు బలపడుతున్నాయని అన్నారు. సరిహద్దుల నిర్వహణపై తాజాగా ఇరుదేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరిగాయని అన్నారు. సైనిక, దౌత్య మార్గాల్లో లోతైన చర్చలు జరిపేందుకు, సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత పరిస్థితులు కొనసాగించేందుకు ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## 19న 'అన్నదాత సుఖీభవ' డబ్బులు జమ



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ రైతులకు గుడ్‌న్యూస్. ఈనెల 19న అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. కడప జిల్లా కమలాపురంలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఈ నిధులను విడుదల చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా అదేరోజు పీఎం కిసాన్ నిధులు విడుదల చేయనుంది. కేంద్రం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. అన్నదాత సుఖీభవ కింద రెండో విడతలో మొత్తం 46 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రైతుకు ఆర్థిక భరోసా కల్పించటం, సాగుకు ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా 'పీఎం కిసాన్–అన్నదాతా సుఖీభవ' పథకాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే. ఈ పథకంలో భాగంగా ఒక్కో రైతుకు మూడు విడతల్లో ఏడాదికి 20వేల రూపాయల నగదు వారి ఖాతాలో జమ కానుంది. ఏడాదికి కేంద్రం ఇచ్చే రూ.6 వేల సాయంతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14 వేలు ఇవ్వనుంది. మొదటి, రెండో విడతల్లో 5 వేలు చొప్పున, మూడో విడత 4 వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. కేంద్ర ప్రభుత్వ కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా ప్రతి సంవత్సరం మూడు విడతల్లో 6 వేల రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న విషయం తెలిసిందే. నాలుగు నెలలకోసారి మొదటి విడుత ఏప్రిల్ – జూలై, రెండో విడత ఆగస్టు – నవంబర్, మూడో విడత డిసెంబర్ నుంచి మార్చిలోపు రూ.2 వేల చొప్పున జమ అవుతున్నాయి. కుటుంబంలో ఒకరికి మాత్రమే : కుటుంబంలో ఒకరికి మాత్రమే అన్నదాతా సుఖీభవ పథకం వర్తిస్తుంది. వెబ్‌ల్యాండ్‌లో రైతు ఆధార్ నంబర్ తప్పుగా ఉంటే రెవెన్యూ అధికారులను సంప్రదించి సరి చేసుకోవాలి. జాబితాలో రైతు పేరు లేకపోయినట్లయితే వ్యవసాయ కేంద్రాల్లో సహాయకులను సంప్రదించాలని అధికారులు సూచించారు.

## అంతమొందించారు: పార్థసారథి

(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రంలో గత పాలకులు రాజకీయ కుట్రలకు, దోపిడీకి పాల్పడటం భక్తులను తీవ్రంగా కలిచివేసిందన్నారు. టీటీడీ పరకామణిలో ఏకంగా వంద కోట్ల రూపాయల విదేశీ కరెన్సీ చోరీ జరిగిందన్న వార్త ఆవేదనకు గురిచేసిందన్నారు. 2023 ఏప్రిల్ 29న నాటి విజిలెన్స్ అధికారి సతీష్ కుమార్ ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేశారని, అయితే ఇంత భారీ దోపిడీకి సాధారణ సెక్షన్లు నమోదు చేయడం వెనుక కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. దోపిడీ ముఠా పనిలా ఈ వ్యవహారం నడిచిందన్నారు. ఈ కేసు దర్యాప్తు తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని పార్థసారథి అన్నారు. కేసు పెట్టిన నెల రోజుల్లోపే, అంటే మే 31న ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం, ఆ మరుసటి రోజే (జూన్ 1న) ఫిర్యాది సతీష్ కుమార్, నిందితుడు రవికుమార్ కలిసి కోర్టులో రాజీ మెమో దాఖలు చేయడం వెనుక ఎవరి ఒత్తిడి ఉందో తేలాలన్నారు. రూ.100 కోట్ల దోపిడీకి బదులుగా నిందితుడు రూ.14.5 కోట్ల ఆస్తులను టీటీడీకి 'దానం' చేసినట్లు చూపించి కేసును నీరుగార్చారని ఆరోపించారు. ఉన్నతాధికారుల ఒత్తిడితోనే సతీష్ కుమార్ రాజీకి అంగీకరించినట్లు విజిలెన్స్ నివేదికలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న సతీష్ కుమార్ అనుమానాస్పద మృతి వెనుక పెద్ద కుట్ర ఉందని పార్థసారథి అన్నారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్యను గుండెపోటుగా చిత్రీకరించినట్లే, సతీష్ కుమార్ మరణాన్ని కూడా ఆత్మహత్యగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సతీష్ సోదరుడు ఇది హత్యేనని చెబుతున్నా, పోలీసుల కంటే ముందే టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆత్మహత్యగా ప్రకటించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాజీ వ్యవహారం కూడా భూమన ఛైర్మన్ అయిన నెల రోజుల్లోనే జరగడంపై లోతైన దర్యాప్తు అవసరమన్నారు. గతంలో పరిటాల రవి, వివేకానంద రెడ్డి హత్య కేసుల్లో సాక్షులు చనిపోయినట్లే, ఈ కేసులోనూ సాక్షులను లేకుండా చేసే కుట్ర జరుగుతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తును వ్యతిరేకించిన వైసీపీ నేతలు, ఇప్పుడు ఈ కేసులో సీబీఐ విచారణ కోరడం వాస్తవాలను నీరుగార్చే ప్రయత్నమేనని విమర్శించారు.

# మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ దరఖాస్తులు ఆహ్వానం



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం,మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధ ప్రకటించారు.ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు నవంబర్ 17 నుండి 20 వరకు ఆఫ్‌లైన్ విధానంలో కళాశాలలో నేరుగా దరఖాస్తులు సమర్పించుకోవాలని సూచించారు.కళాశాలలో బిఏ (మేజర్ ఎకనామిక్స్-మైనర్ పాలిటిక్స్), బీకాం (మేజర్ కంప్యూటర్ అప్లికేషన్స్), బీ.ఎస్సీ (మేజర్ ఫిజిక్స్-మైనర్ కెమిస్ట్రీ), బీ.ఎస్సీ (మేజర్ జువాలజీ-మైనర్ బోటనీ), బీ.ఎస్సీ (మేజర్ మ్యాథ్స్-మైనర్ కెమిస్ట్రీ) వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.విద్యార్థినుల కోసం కళాశాల ఆవరణలో ఉచిత హాస్టల్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

అనుభవజ్ఞులైన లెక్చరర్ల బృందం ద్వారా బోధన అందించబడుతుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.ఆశక్తి కలిగిన విద్యార్థినులు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్ (10వ, ఇంటర్),10వ %‌ఒ% ఇంటర్ మార్కుల జాబితా,కుల ధృవీకరణ పత్రం,ఆదాయ ధృవీకరణ పత్రం,స్టూడెంట్, ఫాదర్ & మదర్ ఆధార్,ఇమెయిల్ ఐడి,జాయింట్ బ్యాంక్ అకౌంట్ వివరాలు,ఆధార్ లింక్ చేసిన ఫోన్ నెంబర్,6 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో నాలుగు జెరాక్స్ సెట్లతో విద్యార్థినులు నేరుగా కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధ సూచించారు.

# పి. పొన్నవోలలో సంవత్సరాల తరబడి తీరని డ్రైనేజీ సమస్య



**రావికమతం, పతాకం న్యూస్:** రావికమతం మండలం పి.పొన్నవోలు గ్రామంలో అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న డ్రైనేజీ కాలువ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత పంచాయితీ అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు పలుమార్లు వినతులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకూ ఎటువంటి స్పందన లభించకపోవడం తో గ్రామస్థులను తీవ్ర ఆవేదన చెందుతున్నారు. డ్రైనేజీ కాలువలు పూడికలు తీయకపోవడం తో మురుగు నీరు నిల్వ తో దోమల ప్రబలి గ్రామంలో ప్రజలు అనారోగ్యాల పాలై అనేక సమస్యలు ఎదురుకుంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. దుర్వాసన, అస్వచ్ఛత, ఆరోగ్య సమస్యలు గ్రామ జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. సంవత్సరాలుగా మా సమస్యను అధికారులు గానీ, నాయకులు గానీ పట్టించుకోకపోవడం విచారకరమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పంచాయితీ అధికారులు స్పందించి తక్షణమే అధికారులు ప్రత్యక్షంగా గ్రామాన్ని సందర్శించి, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# జీతాలపై ఆంక్షలు ఎత్తివేయాలి.. స్టీల్ అఖిలపక్షాల ధర్నా




**గాజువాక, పతాకం న్యూస్:** విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం కార్మికుల జీతాలపై ఉత్పత్తి ఆధారంగా చెల్లిస్తామన్న సర్క్యులర్ను తక్షణం ఉపసంహరించుకోవాలని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం స్టీల్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్ యాజమాన్య చర్యలకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జె అయోధ్య రామ్ మాట్లాడుతూ స్టీల్ కార్మికులకు చెల్లించాల్సిన జీతాలపై నేడు యాజమాన్యం అనాలోచిత నిర్ణయం తీసుకొని దానిపై ఆదేశాలు ఇవ్వడం అత్యంత దుర్మార్గమని ఆయన విమర్శించారు. ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లిస్తానని యాజమాన్యం వల్ల వేయడం వెనక ప్రభుత్వ కుట్ర దాగి ఉందని ఆయన వివరించారు. ఉత్పత్తికి అవసరమైన రా మెటీరియల్ సమకూర్చడంలో యాజమాన్యం వైఫల్యం చెందిందని దానిని కప్పిపుచ్చుకోవడానికి కార్మికులపై నెపండుతున్నారని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలపై చిత్తశుద్ధి ఉందా అని ఆయన ప్రశ్నించారు. కనుక నేడు ప్రభుత్వ యాజమాన్యాలు కార్మికుల కష్టార్జితంపై చేస్తున్న దాడులను తక్షణం ఆపాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. స్టీల్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ మాట్లాడుతూ చట్టాల్లో లేనివిధంగా నేడు కార్మికులపై స్టీల్ యాజమాన్యం చేస్తున్న దాడిని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఉత్పత్తికి అవసరమైన రా మెటీరియల్స్ మరియు కార్మికులను ప్రోత్సహించకుండా ఉత్పత్తి సాధించాలని చెప్పడం అత్యంత దుర్మార్గమని ఆయన అన్నారు. కార్మికుల జీతాలపై స్టీల్ యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్ ను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు రమణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరించాలని దురుద్దేశంతోనే కర్మాగారం పైన, కార్మికుల పైన దాడి చేస్తుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కార్మిక వర్గం ఐక్యంగా ఈ చర్యలను తిప్పి కొడతామని ఆయన అన్నారు. ఇదే సమయంలో ఉత్పత్తి పెరగాలంటే కర్మాగారం లో ఉన్న యంత్ర పరికరాలు వాటి సామర్థ్యానికి అవసరమైన మరమత్తులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సిఐటియు నాయకులు ఎం రామారావు, స్టీల్ ఐ ఎన్ టి యు సి చీఫ్ పాటర్న్ మంత్రి రాజశేఖర్, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డివి రమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు తదితరులు మాట్లాడుతూ స్టీల్ యాజమాన్య చర్యలను తీవ్రంగా విమర్శించారు. అలాగే తక్షణం ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లిస్తానని చెప్పే సర్క్యులర్ ను తక్షణం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు పి శ్రీనివాసరాజు, జె రామకృష్ణ, జి ఆర్ కె నాయుడు, గణపతి రెడ్డి, డేవిడ్, కారు రమణ, కె ఎం శ్రీనివాస్, జి పుల్లారావు, వి ప్రసాద్ తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు మరియు అధిక సంఖ్యలో నూతన కార్మికులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు ప్రత్యామ్నాయ మార్గం చూపించకుండా పనులు చేస్తున్న దువ్వాడ రైల్వే స్టేషన్ అధికారులు



**దువ్వాడ, పతాకం న్యూస్:** దువ్వాడ రైల్వే స్టేషన్ నాలుగో నెంబర్ ప్లాట్ ఫామ్ ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గం వద్ద దువ్వాడ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి కోసం అమృత్ భారత్ పథకం పనులు చేపట్టారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించకుండా చేపట్టిన ఈ పనులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దువ్వాడ వద్ద సింహాద్రి ఎక్స్ప్రెస్ గుంటూరు నుండి విశాఖపట్నం సాయంత్రం నాలుగు గంటల 25 నిమిషాలకు చేరుకున్న పిల్లలు మరియు సామగ్రితో ఉన్న మహిళలు సహా ప్రయాణికులు కాంపౌండ్ వాల్ పై నుండి దూకి బస్సుల కోసం, ఆటోల కోసం రోడ్డుకి చేరుకుంటున్నారు. ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ ముందు వరకు ఈ కూల్చివేత పనులు జరగడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనుల వద్ద ఆర్పీఎఫ్ సిబ్బంది ఎవరూ కనిపించకపోవడంతో ఆటో డ్రైవర్లు సైతం లోపలికి ప్రవేశించడం తో ఆ ప్రాంతం రద్దీగా మారింది. ప్రయాణికుల ఎంట్రీ ఎగ్జిట్ కు ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపించాలని జెడ్ ఆర్ యు సి సి సభ్యులు కే ఈశ్వర్ విజ్ఞప్తి చేస్తున్నారు.

# గిరిజన విద్యార్థిని విద్యార్థులపై ప్రభుత్వం ఇంత నిర్లక్షమా ?

### పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం లోని రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ వల్ల 22 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారనే విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న విద్యార్థినిలను హుటాహుటిన వెళ్ళి పరామర్శించి,పిల్లల ఆరోగ్య పరిస్థితిని గురించి డాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు.తదుపరి బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి,పాఠశాలలో ఉన్న పలు సమస్యలు గుర్తించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నిర్వీర్యం చేసి అంధకారంలోకి నెడుతూ పరిపాలన చెయ్యడం దుర్మార్గమైన చర్య అని,గత నెలలో కురుపాం నియోజకవర్గం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సుమారుగా 120 మంది విద్యారులు అస్వస్థతకు గురై ఐదు గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని,ఇంతలోనే మొన్నటికి మొన్న గూడెం కొత్త వీధి మండలం జర్రెల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ వల్ల సుమారుగా 50 మంది విధ్యార్థులు ఆసుపత్రి పాలై వారి ఆరోగ్యం మెరుగుపడకుండానే నిన్న ఉదయం కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలలో 22 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం చాలా దారుణమని అన్నారు.ఇలాంటి వరుస సంఘటనలు జరగడం వల్ల విద్యార్థుల తల్లి తండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలంటేనే తీవ్ర భయాందోళనతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని శాసన సభ్యులు అన్నారు.ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పనుండి రాష్ట్ర ప్రజలకు గుడికి వెళ్లినా,బడికి వెళ్లినా తమ మాన ప్రాణాలకు భద్రత కల్పించలేని దుస్థితిలో ఈ కూటమి ప్రభుత్వం పరిపాలన చేస్తుందని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.అలాగే రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యేకు ఎదురుగా పూర్తిగా బాత్రూం డోర్ లు పాడైపోయి కనిపించడంతో ఆడ పిల్లలు ఇటువంటి బాత్రూంలు వాడుతున్నారా? అని ఆశ్చర్యాన్ని,ఆవేదన వ్యక్తం చేస్తూ, సరైన బాత్రూమ్ డోర్లు వేయించలేని దుస్థితిలో ఈ కూటమి ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులతో పాటు స్థానిక ఎంపీపీ బడుగు రమేష్,వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ,మండల పార్టీ అధ్యక్షులు బిడిజన అప్పారావు, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ అచ్యుత్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు,మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ సమర్ల సూరిబాబు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు ముసలినాయుడు,అంతాడ సర్పంచ్ చంద్రరావు,ఎం మాకవరం సూపర్ సర్పంచ్ కోడా రాజుబాబు,పార్టీ నాయకులు రామ్మూర్తి,కాకరి బాలరాజు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



**బుచ్చెయ్యపేట, పతాకం న్యూస్:** డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు 'అభ్యుదయం' పేరుతో పోలీసు శాఖ చేపట్టిన సైకిల్ యాత్ర సాయంత్రం వడ్డాది చేరుకుంది. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, తెలిసీతెలియని వయసుల్లో విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం గమనిస్తూ, చెడు అలవాట్ల దరికి చేరకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజి డీఐజీగోపీనాథ్ జట్టి బుచెయ్యపేట పోలీసులను ఆదేశించారు. ఆదివారం ఆయన పోలీసు స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, దర్యాప్తులో పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను కఠినంగా అమలు చేయాలని, వాహనచోదకులు సీటు బెల్ట్/ హెల్మెట్ వాడకం నిబంధలను కచ్చితంగా పాటించేలా చూడాలన్నారు. వివిధ రూట్లలో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ మండలం మీదుగా గంజాయి రవాణాను పూర్తిగా కట్టడి చేయాలని ఆదేశించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రజలు వీటి బారిన పడకుండా వుండేందుకు గ్రామాల్లో ప్రచారం నిర్వహించడంతోపాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, మహిళా చట్టాలు, హెల్ప్‌లైన్ వినియోగంపై గ్రామాల్లో ప్రచారం చేయాలని అన్నారు. డీఐజీ వెంట ఎస్ఐలు ఎ.శ్రీనివాసరావు, రఘువర్మ, నారాయణరావు, పోలీసు సిబ్బంది వున్నారు.

# 200 మంది కూటమి నేతలు వైఎస్ఆర్‌సీపీలో చేరిక: ఎమ్మెల్యే మత్స్యలింగం



**అరకు, పతాకం న్యూస్:** అరకు నియోజకవర్గం డుంబ్రిగూడ మండలం అరమ గ్రామ పంచాయతీ మంజగూడ గ్రామం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని వీడి సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఒక్కసారిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్‌సీపీ)లో చేరారు. ఈ కార్యక్రమం పండగ వాతావరణంలో జరిగింది. ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతూ, పూలమాలలు వేస్తూ, బాజా భజంత్రీలతో, గిరిజన సాంప్రదాయ దింస నృత్యం చేస్తూ అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ని ఘనంగా స్వాగతం పలికారు.టీడీపీ అరమ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు వంతల ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరిక కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సమక్షంలో కొత్తగా చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. చేరికలో వంతల ఆనంద్, పాంగి శ్రీను, వంతల గంగాధర్, ఉర్దూబ్, పాంగి దేవగున్, రామన్న తదితరులు. కూటమి నిర్లక్ష్యం-ప్రజల ఆమోదం పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ: 10 సంవత్సరాలుగా కూటమి పార్టీల్లో కష్టపడినా నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు లేదు. కూటమి ప్రభుత్వంలో గ్రామానికి ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా సహకరించలేదు. ప్రజల ఆమోదంతో వైఎస్ఆర్‌సీపీలో చేరామని, కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరగడం లేదని వాపోయారు.మేలు జరగాలంటే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంతోనే సాధ్యమని అన్నారు. అనంతరం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుంది.కష్టపడిన వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయని అన్నారు.రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో టికెట్లు క్షేత్రస్థాయి పనితీరు ఆధారంగా కేటాయిస్తామని తెలిపారు.వైఎస్ఆర్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ బలోపేతమవుతోందని, ఈ చేరికలు దానికి నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, మండల పార్టీ అధ్యక్షులు పాంగి పరశురామ్, ఉప ఎంపీపీ శెట్టి ఆనంద్,అరమ సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యులు దళపతి తుమ్మాద్, మండల సర్పంచుల పోరం అధ్యక్షులు కిముడు హరి, సర్పంచులు గుమ్మ నాగేశ్వరరావు, వంతల వెంకట్రావు,ఒరబోయిన సుబ్బారావు, ఎంపిటిసి మహదేవ్, అరకులోయ జడ్పిటిసి శెట్టి రోషిణ మండల మహిళా నాయకులు వంతల భబిత,బంగురు శాంతి, వైఎస్ఆర్పిపి సీనియర్ నాయకులు తాంగుల రామదాసు, వంతాల సద్దు, కమ్మిడి అశోక్,వైసీపీ అరకు నియోజకవర్గం బూత్ కమిటీ ఇన్చార్జ్ విజయ్ పాంగి మండల ప్రధాన కార్యదర్శులు మఠం శంకర్, హెచ్ బి రామానాయుడు, కమ్మిడి దశమి బోయి కిరణ్ కుమార్ పాంగి ధనుంజయ్ గారు,రాందాస్ అధిక సంఖ్యలో గ్రామస్తులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పాత కణితి శివాలయంలో భారీ అన్న సమారాధన



**గాజువాక, పతాకం న్యూస్:** జీవీఎంసీ 87 వార్డు పరిధిలోగల పాత కణితి శివాలయములో కార్తీక మాసం నాలుగో సోమవారం పర్వదిన సందర్భంగా వైభవంగా పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కణితి గ్రామ కమిటీ సభ్యులు పాల్గొని పూజలు, పాలాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం పాత కణితి శివాలయంలో ప్రతి ఏటా మాదిరి ""భారీ అన్న సమారాధన "" చేపట్టారు. కణితి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్ఎస్ విజయరామరాజు, కణితి గ్రామ దేవత కమిటీ చైర్మన్ ప్రగడ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ చిత్రాడ సన్యాసిరావు, దుగ్గపు దానప్పలు, బొడ్డ సన్యాసిరావు, ఎస్ సీతారామరాజు, బి గోవిందరాజులు,ఆలయ కమిటీ సభ్యులు , కాండ్రేగుల అప్పలనాయుడు, బోడ్డేటి మోద నాయుడు,నర్రా రామారావు, నాని, గంధవరపు మురళి, దాసరి రమణ, చంద్రశేఖర్ విభూషణ్, తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే గేటు పడితే నరకమే

## పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు తప్పని ఇబ్బందులు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో రైల్వేఫ్లైఓవర్ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 12 చోట్ల వంతెన నిర్మాణానికి రైల్వే అధికారులు ఈ ఏడాది మార్చిలో సన్నాహాలు చేశారు. కానీ, తర్వాత వాటి ఊసే మరచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రైల్వే గేటు పడితే చాలు.. నిరీక్షణతోపాటు ట్రాఫిక్ నిలిచిపోయి అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల ప్రజలకు రైల్వేగేట్లు నరకయాతన చూపిస్తున్నాయి. ఇచ్ఛాపురం పట్టణాన్ని వేరుచేస్తూ ఉంటుంది రైల్వేలైన్. సగం పట్టణం రైల్వేలైన్ అవతల ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇచ్ఛాపురంలో రైల్వేగేటు పడిందంటే చాలు ట్రాఫిక్ నిలిచిపోతుంది. ముఖ్యంగా రత్తకన్న గేటు నరకం చూపిస్తోంది. రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉండడంతో నిత్యం ఈ గేటు వేసి ఉంటుంది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించేవారు పడే బాధలు అన్నీఇన్నీకావు. పురుషోత్తపురం, జగన్నాథపురం గేట్లు కూడా నరకయాతన చూపిస్తుంటాయి. పలాస-కాశీబుగ్గ పట్టణ ప్రజలు వెళ్లాలంటే కాశీబుగ్గ సమీపంలోని ఎల్‌సీ గేటును దాటాల్సి ఉంటుంది. అటు వజ్రపుకొత్తూరు వెళ్లాలంటే తాళ్లభద్ర ఎల్‌సీ గేటు దాటాలి. ఈ రెండు గేట్లు పలాస రైల్వేస్టేషన్‌కు అటు ఇటుగా ఉంటాయి. దీంతో రైలు నిలిచినా.. గేటు అలానే మూసి వేసి ఉంటోంది. ఇప్పుడు కాశీబుగ్గ గేటు వద్ద వంతెన పనులు ప్రారంభం కావడంతో కొంతమ ఉపశమనం కలుగనుంది. మందస మండల ప్రజలకు కొర్రాయిగేటు, బాలిగాం, కొత్తపల్లి గేట్లు నరకయాతన చూపిస్తుంటాయి. సోంపేట మండలంలో పాలవలస, కొర్లాం గేట్ల వద్ద నిత్యం అదే పరిస్థితి. కంచిలి మండలానికి సంబంధించి బూరగాం, అంపురం, గొల్ల కంచిలి రైల్వేగేటు నిత్యం ప్రజలకు యాతన తప్పదు. ఇటీవల రైల్వేశాఖ విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్ ప్రకటించింది. ఉత్తరాంధ్ర ప్రాంతమంతా ఈ జోన్ పరిధిలోకి వచ్చింది. కానీ పలాస-ఇచ్ఛాపురం స్టేషన్ల మధ్య ఉన్న 49 కిలోమీటర్లను మాత్రం భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న ఈస్టుకోస్టు రైల్వేజోన్‌లో వదిలేసింది. దీంతో రెండు నియోజకవర్గాల ప్రజలు తీవ్ర నిరాశతో ఉన్నారు. వాస్తవానికి హైవేల ఆధునికీకరణ ప్రక్రియ పూర్తయింది. ప్రధాన పట్టణాలను తప్పిస్తూ హైవేల నిర్మాణం జరిగింది. హైవే ఆధునికీకరణలో భాగంగా రైల్వేలైన్ ఉన్నచోట ఫ్లైఓవర్ నిర్మించారు. పట్టణాలకు ఉన్న రోడ్లలో మాత్రం రైల్వేగేట్లు ఉండిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా ఫ్లైఓవర్ల పనుల విషయమై రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రైల్వేశాఖ ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరముంది.

## రోడ్డు పనులను పరిశీలించిన డిప్యూటీ మేయర్ దల్లి



**గాజువాక, పతాకం న్యూస్:** జీవీఎంసీ డిప్యూటీ మేయర్, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి రహదారి మరమ్మతు పనులు పరిశీలించారు. పెద గంట్యాడ నుంచి గంగవరం వెళ్లే రహదారి రాకపోకలకు ఇబ్బంది కరంగా ఉండడంతో ఆ రహదారి మరమ్మత్తు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. పాదచారులు, వాహనదారులు పెద గంట్యాడ నుంచి గంగవరం రాకపోకలు సాగించేందుకు పలు అవస్థలకు గురవుతున్నారు. రహదారి గోతుల మయంగా మారడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి తెలుసుకొని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో నిధులు మంజూరు చేయించిన డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి రహదారి మరమ్మత్తు పనులకు శ్రీకారం చుట్టారు. త్వరలోనే రహదారి నిర్మాణం చేపడతామని ఆయన స్పష్టం చేశారు. 64 వార్డ్ ప్రెసిడెంట్, విశాఖ జిల్లా మాజీ పార్లమెంట్ అధికార ప్రతినిధి చోడిపిల్లి ముసలయ్య ఆధ్వర్యంలో కూటమి నాయకులు, టిడిపి 64 వార్డ్ ప్రెసిడెంట్ కొవిరి హరికృష్ణ, ఎం నర్సింగ్ రావు, బి మాధవరావు, కే.అవతారం, పోలరాజు కొండల రావు, దేవుడు,ఒలిశెట్టి బంగారు రాజు, సతీష్ పాల్గొన్నారు.

## స్మశానవాటిక సమస్యలపై ఆర్డీవోకి ఎంఆర్పీఎస్ వినతిపత్రం అందజేత



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం మున్సిపాలిటీ 3వ వార్డు ఎస్సీ కాలనీలోని స్మశానవాటిక సమస్యలు భరించలేనివిగా మారాయని పేర్కొంటు ఎంఆర్పీఎస్, ఎంపీఎస్ అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నర్సీపట్నం నియోజకవర్గ ఇంచార్జ్ మారుడిపూడి సతీష్ (సత్తిబాబు) నేడు నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి వివి రమణకు వినతిపత్రం అందజేశారు. స్మశానవాటికలో తుప్పలు అధికంగా పెరిగిపోవడం, పశువుల వ్యర్థాలు మరియు కళేబారాలు పడేయడం వలన వస్తున్న దుర్వాసన కారణంగా ప్రజలు మృతదేహాలను ఖననం చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో సతీష్ వివరించారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని స్మశానవాటికను శుభ్రపరచాలని, వ్యర్థాలు పడేయడంపై కఠిన నియంత్రణలు విధించాలని ఆయన ఆర్డీవో ని కోరారు.

# హిందూపురం వైసీపీ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే మత్స్యలింగం




**అరకులోయ, పతాకం న్యూస్:** హిందూపురంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై టీడీపీ గుండాలు జరిపిన దాడిని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తీవ్రంగా ఖండించారు. సోమవారం అరకులోయలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "హిందూపురం వైఎస్ఆర్సిపి కార్యాలయంపై దాడి అత్యంత దారుణం. మీకు కొంచెం సిగ్గు ఉంటే పద్ధతిగా పనిచేయండి. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజలు ప్రశ్నిస్తే ఇలా గుండాయిజం ప్రదర్శిస్తారా?" అని మండిపడ్డారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న వైద్య విద్యా సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని, మరింత ఉధృతంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు రేగం చాణిక్య, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమ్మిడి అశోక్, అరకు అసెంబ్లీ బీసీ సెల్ అధ్యక్షులు గెడ్డం నరసింగరావు, అరకులోయ మండల ఉపాధ్యక్షుడు పల్టా సింగి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ గర్ల్స్ పాఠశాలలో అపరిశుభ్రతపై మాజీ ఎంపీపీ ఆగ్రహం



**కొయ్యూరు, పతాకం న్యూస్:** కొయ్యూరు మండలం ఆర్.జె.పాలెం గర్ల్స్ కేజీబీవీ పాఠశాలలో ప్రహారీ గోడకు ఆనుకొని తవ్విన ఇంకుడు గుంత తీవ్ర అపరిశుభ్రతకు కారణమైం దని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. మాజీ ఎంపీపీ గొలుసింగి సత్యనారాయణ,కూటమి నాయకులతో కలిసి పాఠశాలను పర్యవేక్షించారు. గోడకు ఆనుకొనివున్న ఇంకుడుగుంతలో నిల్వనీరు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నదని తెలిపారు. ఈ దుర్వాసన వాయు కాలుష్యానికి దారితీయడంతోపాటు పిల్లల్లో ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే నిల్వ నీరు కారణంగా మలేరియా,డెంగ్యూ వంటి వ్యాధుల ప్రబలితమై ఎక్కువై విద్యార్థులు ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ఈ సమస్యపై అధికారులు నిర్లక్ష్యం వహించడం విచారకరమని,వెంటనే స్పందించి ఆ గుంటను పూడ్చిపెట్టేలా చర్యలు తీసుకోవాలని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్రు రామమూర్తి,కొయ్యూరు సర్పంచ్ బాలరాజు,పొటుకూరి సన్యాసిరావు,కొర్రు పుల్లయ్య,గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## నాగావళి నదిలో మత్స్యకారుడు గల్లంతు



**విజయనగరం, పతాకం న్యూస్:** రేగిడి మండలం తునివాడ గ్రామ సమీపంలో ఉన్న నాగావళి నదిలో స్నానానికి దిగిన మత్స్యకారుడు ముంతల లక్ష్మణరావు సాయంత్రం గల్లంతయ్యారు. భార్య గౌరీ ఫిర్యాదు మేరకు రేగిడి ఎస్సై వి బాలకృష్ణ ఆధ్వర్యంలో అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సోమవారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపడుతున్నారు. అయితే ఇంతవరకు ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదు. తునివాడ నుంచి నాగావళి దిగువ భాగం ఖండ్యాం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. లక్ష్మణరావుకి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## దొరబాబు చేతుల మీదుగా స్కూల్ భవనాల శంకుస్థాపనలు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు కొయ్యూరు మండలం,డౌనూరు పంచాయతీలోని రేల్లలపాలెం,రొబ్బసింగి గ్రామాల్లో కొత్త స్కూల్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ చైర్మన్ సుమర్ల సాంబశివ,సర్పంచ్ పొట్టిక భవాని పాల్గొన్నారు. టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబు మాట్లాడుతూ ఎ.డబ్ల్యూ. ఈ నిధులతో ప్రతి స్కూల్‌కు రూ.13,50,000 రూపాయల వ్యయంతో భూమి పూజ చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో విద్యకు లోకేష్ బాబు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, మారుమూల గ్రామాలలో కూడా సీసీ రోడ్లు, డ్రైనేజీలు,చెక్‌డ్యామ్‌లు,పంచాయతీ భవనాలు వంటి అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో కొట్టుమిట్టాడతున్న చిన్నారిని కాపాడి.. యువకుడి మృతి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం రూరల్ మండలం కుందు వానిపేట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. సూరాడ రోషన్ (10) అనే చిన్నారి స్థానికంగా ఉన్న చెరువులో ఈతకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీటిలో కొట్టుమిట్టాడసాగాడు. ఈ దృశ్యాన్ని గమనించిన గ్రామానికి చెందిన సోడిపల్లి రమేష్(23) వెంటనే బాలుడిని రక్షించేందుకు తీవ్రంగా శ్రమించాడు. ఎట్టకేలకు అతని ప్రయత్నం ఫలించింది. బాలుడిని ఒడ్డుకు చేర్చాడు. కానీ అప్పటికే రమేష్ బాగా అలసిపోవడంతో నీటిలో మునిగిపోసాగాడు. దీన్ని గుర్తించిన గ్రామస్థులు స్పందించి... బయటకు తీశారు. వెంటనే స్థానిక సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రమేష్ ఇటీవలే ఓ షిప్ కంపెనీలో ఉన్నత ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ నెల 18న విధుల్లో చేరాల్సి ఉంది. ఇంతలోనే మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు తీవ్రంగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు.

## సంఘ అభివృద్ధికి కృషి చేయండి



**నక్కపల్లి, పతాకం న్యూస్:** నక్కపల్లి తాలూకా బ్రాహ్మణ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆ సంఘ గౌరవా ధ్యక్షులు శ్రీపాద సత్యదేవ శర్మ అన్నారు. తాలూకా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పెనుగొల్లు జాతీయ రహదారి పక్కన కొబ్బరి తోటలో వన సమారాధన ఘనంగా నిర్వహించారు. లక్కపల్లి ఎస్ రాయవరం మండలాలకు చెందిన బ్రాహ్మణ బంధువులు విరివిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు సత్యదేవ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఎవరికైనా సాయం చేసే దిశగా ఎదగాలని అన్నారు. అనంతరం అధ్యక్షుడు డి.వి.రామారావు మాట్లాడుతూ దాతలు సహకారంతో నక్కపల్లి లోని సంఘ భవనం నిర్మాణం పూర్తయిందని దాని నిమిత్తం బ్రాహ్మణ బంధువులు ఎవరైనా శుభకార్యముల కొరకు వినియోగించుకోవాలనుకుంటే అందుబాటులోకి వచ్చిందని అన్నారు. ఎవరైనా సభ్యులకు ఇబ్బంది కలిగితే సంఘం తరపున పోరాడి సాయం చేయాలని అన్నారు. ఉదయం ఉసిరి వృక్షం వద్ద పూజల నిర్వహించి అనంతరం సమావేశం నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగానే వన సమారాధన కార్యక్రమంలో భాగంగా భారీ భోజన ఏర్పాట్లు నిర్వహించారు. అనంతరం మహిళలు,పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలో పాటలు ఆడి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మలూరు సిద్ధాంతి గారు, గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, ఆచంట రామకృష్ణ,శ్రీపాద ప్రణవరాం, దాతారం మురళీకృష్ణ, పెద్ద బాబి గారు, దేవులపల్లి బాబి గారు, తదితర పెద్దలు సంఘ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో సిఐటియు జాతీయ మహాసభల లోగో ఆవిష్కరణ




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం ఇంద్రా మార్కెట్లో ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం లోగో ఆవిష్కరణ జరిగింది. డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను పురస్కరించుకుని ఈ లోగోను ఆవిష్కరించారు. జనవరి 4న ఆర్కే బీచ్‌లో లక్షలాది మంది పాల్గొనే భారీ బహిరంగ సభ జరగనుండగా, కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. డిసెంబరు నాలుగో వారంలో "శ్రామిక ఉత్సవ్" పేరుతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ మహాసభలు చారిత్రాత్మక ప్రాధాన్యతను సంతరించుకున్నాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ పరిరక్షణ పోరాటానికి విశాఖపట్నం వేదికగా నిలుస్తోందని అన్నారు. మరోవైపు కార్పొరేట్లకు ప్రాధాన్యం ఇస్తూ, కార్మికుల వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. ముఖ్యంగా స్టీల్ ప్లాంట్ కార్మికులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. నాయకులు ఈరెల్లి చిరంజీవి, ముఠా కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. నానాజీ, జిల్లా ప్రెసిడెంట్ జి. అప్పారావు, సంఘం ప్రెసిడెంట్ ఆర్. గోవిందు, కోశాధికారి ఎం. రమణ, సాంబ, రాము తదితరులు పాల్గొన్నారు.

## చంద్రయాన్-4 ప్రయోగంపై ఇస్రో ఛైర్మన్ నారాయణ్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** త్వరలో చేపట్టబోయే చంద్రయాన్-4 ప్రయోగంపై ఇస్రో ఛైర్మన్ వి నారాయణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తన మొదటి మానవసహిత అంతరిక్ష యాత్ర 2027లో ఉండనుంది. మరో 7 ప్రయోగాలను ఇస్రో ప్లాన్ చేసిందని ఓ జాతీయ మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. చంద్రయాన్-4 ప్రయోగం ద్వారా ఈ ప్రయోగంలో చంద్రుడి దక్షిన ధ్రువంలోని వాటర్ ఐస్‌ను అధ్యయనం చేయనున్నారు. ఇది ఇస్రో చరిత్రలోనే అత్యంత క్లిష్టమైన అంతరిక్ష యాత్రలో ఒకటిగా నిలువబోతోంది. దీంతో పాటు జేఏఎక్స్‌ఏ (జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ)తో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న మిషన్ లూపెక్స్ ద్వారా చంద్రుడి ధ్రువాల అన్వేషణ కార్యక్రమం కూడా ఉండబోతోంది. చంద్రయాన్ -4 చంద్రుడి నసుంచి నమూనాలనున భూమికి తీసుకురావడాన్ని లక్ష్యంగా ఇస్రో పెట్టుకుంది. ఇప్పటి వరకు అమెరికా, చైనాలు మాత్రమే ఇలాంటి విజయవంతమైన ప్రయోగాలు నిర్వహించాయి. అంతరిక్షంలో సొంతగా అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఇస్రో భావిస్తోంది. దీనికి పని ప్రారంభించినట్లు నారాయణన్ చెప్పారు. ఐదు మాడ్యూళ్లతో ఈ కేంద్రాన్ని 2028లో కక్ష్యలో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. దీనిని 2035 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే నాసా ఐఎస్ఎస్, చైనీస్ అంతరిక్ష సంస్థకు తియాంగాంగ్ వంటి సొంత అంతరిక్ష కేంద్రాలు ఉన్నాయి.

## గొడ్డు మాంసం, కాఫీ, పండ్లపై టారిఫ్‌లు తగ్గించిన ట్రంప్



**న్యూయార్క్:** గొడ్డు మాంసం, కాఫీ, పండ్లతో సహా పలు వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌లను తగ్గించారు. ఈమేరకు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ధరలు చాలా ఎక్కువగా వుంటున్నాయంటూ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, ఒత్తిళ్ళ మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఎన్నికల్లో ఏ ఓటరును కదిపినా అందరూ అన్నింటికంటే ఆర్థికపరమైన సమస్యలనే ముఖ్యంగా ఎత్తిచూపించారు. ఫలితంగా వర్జీనియా, న్యూజెర్సీల్లో జరిగిన ఎన్నికల్లో డెమోక్రాట్లు భారీగా విజయాలు సాధించారు. మొత్తంగా 200 ఆహార ఉత్పత్తులపై ట్రంప్ టారిఫ్‌లను తగ్గించారు. వీటిల్లో అరటిపళ్ళు, ఆరంజ్ జ్యూస్ వంటివి కూడా వున్నాయి. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసహనం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. దేశంలో ద్రవ్యోల్బణం లేదంటూ ట్రంప్ పదే పదే చెబుతూ వస్తున్నా టారిఫ్‌లు తగ్గించారంటే ప్రజల నుండి వచ్చిన ఒత్తిళ్ళు, రాజకీయ ఒత్తిళ్లు అన్నీ కారణాలు గానే కనిపిస్తున్నాయి. ట్రంప్ టారిఫ్ వ్యూహం నుండి కొద్దిగా పక్కకు మళ్ళడమే అవుతోంది.

### గ్రావెల్ కనబడితే చాలు..

## వాలిపోతున్న అక్రమార్కులు



**నూజివీడు పతాకం న్యూస్:** గ్రావెల్ కనబడిందా.. తవ్వేసేయ్.. ఇది నూజివీడు, ఆగిరిపల్లి మండలాలలోని వివిధ గ్రామాల్లో గట్లపై గ్రావెల్ అక్రమ క్వారీదార్ల నిర్వాకం. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో విజయవాడ తదితర ప్రాంతాల్లో వెంచర్లకు గ్రావెల్ డిమాండ్ ఉండడంతో నూజివీడు నియోజకవర్గంలో విస్తారంగా గ్రావెల్ లభ్యమయ్యే గట్లపై గ్రావెల్ అక్రమార్కుల కన్ను పడింది. నూజివీడు మండలం దిగవల్లి తెల్లపొడుగట్టుకు సంబంధించి దాదాపు 15 రోజులుగా అక్రమ క్వారీ నిర్వహిస్తుండడతో సమీప గ్రామ వాసులైన హనుమంతులగూడెంకు చెందిన వారు అడ్డుకోవడంతో గతవారం క్రితం గ్రావెల్ తోలకాలు నిలిచాయి. అయితే తాజాగా రాత్రి తిరిగి గ్రావెల్ తవ్వకాలకు అక్రమార్కులు తెరలేపడంతో గ్రామస్తులు వాహనాలను అడ్డుకునేందుకు స్థానిక మీడియాకు సమాచారం ఇచ్చారు. ఇది తెలిసిన అక్రమార్కులు మీడియా ప్రతినిధులు ఘటనా స్థలానికి చేరుకునేలోపే వాహనాలను అక్కడి నుంచి తరలించడం విశేషం. గ్రామ పంచాయతీకి క్వారీ ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం వచ్చే పరిస్థితి ఉండగా గ్రావెల్ తోలకాలకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ఇటు గ్రామాలు సైతం ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. మరోవైపు నియోజకవర్గంలో ఎటువంటి అక్రమాలు చేసిన కఠినంగా వ్యవహరిస్తానని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అధికార పార్టీ నాయకులను హెచ్చరిస్తున్నా కొందరు అధికార పార్టీ నాయకులు వాటిని పెడచెవిని పెడుతూ గ్రావెల్ మట్ట తోలకాలను యథేఛ్ఛగా నిర్వహిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

# పని 'హక్కు' కాదట



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పని హక్కు అనేది మనిషి గౌరవానికి, జీవనోపాధికి అవసరమైన ప్రాథమిక హక్కు. న్యాయమైన, సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు ప్రతి మనిషికీ వుంది. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం లేని పని కోసం ఉపాధి హామీ పథకాల ద్వారా చట్టపరమైన పని హక్కు కల్పించబడుతోంది. అంతేకాదు, నిర్దిష్ట పనిగంటలు అమలు జరుగుతున్నాయి. దేశంలోని ప్రతి వ్యక్తీ సంపూర్ణంగా అభివృద్ధి సాధించడానికి కావాల్సిన కనీస సదుపాయాలే ప్రాథమిక హక్కులు. 'భారత ప్రజాస్వామ్యానికి పునాదిరాళ్లు ప్రాథమిక హక్కులు' అంటారు నానీ ఫాల్కీవాలా. పనిహక్కు అనేది ప్రజలకు ఉత్పాదక పనిలో పాల్గొనే ప్రాథమిక హక్కును సూచిస్తుంది. దీనిని 1948 ఐరాస మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనలో పొందుపరిచారు. భారత రాజ్యాంగం, ముఖ్యంగా ఆర్టికల్ 21, 41 ప్రకారం%ా% జీవించే హక్కులో భాగంగా పనిచేసే హక్కుకు హామీ ఇస్తుంది. ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా స్వేచ్ఛ అసంభవం' అంటారు గాంధీజీ. కానీ, ఆర్థిక స్వాతంత్ర్యం%ా% పని లేకుండా సాధ్యం కాదు. పని-కేవలం ఆదాయం సంపాదించే మార్గం మాత్రమే కాదు, అది ఒక వ్యక్తికి గౌరవం, సామాజిక భాగస్వామ్యం, ఆత్మగౌరవాన్ని కల్పించడం.

'జాతీయ కార్మిక విధానం 2025-2047 ముసాయిదా' కొద్ది రోజుల్లో అమలులోకి రానుంది. మూడు దశల్లో అంటే%ా% 2025-27, 2027-37, 2037-47 లలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. తద్వారా దాదాపు 50 కోట్ల మంది శ్రామికులను ప్రభావితం చేస్తుందని అంచనా. జస్టిస్ గజేంద్ర గడ్కర్ నేతృత్వంలోని మొదటి కార్మిక సంఘం సిఫార్సుల మేరకు అనుసరిస్తున్న సామాజిక భద్రత, పారిశ్రామిక భద్రత, వేతనాల స్థిరీకరణ వంటి కార్మిక చట్టాలను ఈ విధానం అణచివేస్తుంది. 'ప్రభుత్వం గొప్పతనం, అది ప్రజలకు కల్పించే హక్కులపై ఆధారపడి వుంటుంది' అంటారు హెచ్.జె.లాస్కి. మోడీ ప్రభుత్వంలో అమలు చేయనున్న జాతీయ కార్మిక విధానం కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పూర్తిగా మార్చివేసింది. కొత్త ప్రతిపాదన ప్రకారం, ఉపాధి ఇకపై ఒక కర్తవ్యం మాత్రమే, హక్కు కాదు.ఆకొత్త విధానం పనిని ఒక హక్కుగా తొలగించి, దానిని ధర్మంగా, ఒక కర్తవ్యంగా, సేవగా మారుస్తున్నది. ఇది భారత రాజ్యాంగం యొక్క మౌలిక సిద్ధాంతాలను అణచివేయడమే. అంతేకాదు.. కార్మికులకు వ్యతిరేకంగా, యజమానులకు రక్షణగా కొత్త జాతీయ విధానం వుందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. శతాబ్దాల పోరాటం ద్వారా సంక్రమించిన హక్కులు కోల్పోవడమే కాకుండా, బలహీనమైన కార్మికులను పూర్తిగా వీధిలోకి విసిరేస్తారు. రాజధర్మం పేరుతో కార్మిక హక్కులు త్యాగం చేయబడితే, ఆర్థికాభివృద్ధి ఒక వర్గానికే లాభిస్తుంది. దాతృత్వం, ఔదార్యం ముసుగులో హక్కులులేని బానిసలుగా శ్రామికులు మారతారు.

2024 లెక్కల ప్రకారం%ా% భారతీయ శ్రామిక శక్తి దాదాపు 61 కోట్లు. ఈ విధానంతో దేశంలోని 50 కోట్లకు పైగా వున్న శ్రామికుల భవిష్యత్ ప్రమాదంలో పడింది. శ్రమను హక్కుగా కాక ధర్మంగా బోధించడం అంటే, అంబేద్కర్ స్వప్నించిన సమానత్వ రాజ్యాన్ని రద్దు చేయడమే. మనుస్మృతి ఆధారిత ఆలోచనలను శ్రమ న్యాయాలుగా మలచడం అంటే రాజ్యాంగాన్ని సవాలు చేయడమే. ఈ దేశంలో ప్రజాస్వామ్యం%ా% హక్కుల పునాదిపైనే ఆధారపడి వుంది. పని హక్కుగా వుండాలి%ా% దాతృత్వంగా కాదు. యువత భారతదేశం యొక్క గొప్ప సంపద. ప్రతి ఏడాదీ లక్షలాది యువతీ యువకులు ఉపాధి ఆశతో మార్కెట్‌లోకి అడుగుపెడుతున్నారు. ఇప్పటికే నిరుద్యోగం, ఉపాధిలేమి వారిని నిరాశ, నిస్పృహలలోకి నెట్టేస్తున్నది. శ్రమించేవారికి భద్రత ఇవ్వకుండా, దేశాభివృద్ధిని ఆశించడం స్వప్నమే తప్ప, వాస్తవం కాదు' అంటారు అమెరికన్ ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కెయిన్స్. దేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే%ా% ఉద్యోగాల కల్పన ప్రధాన లక్ష్యం కావాలి. కార్మికుల నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం, సామాజిక భద్రత కల్పించడం ద్వారా ఆర్థిక పురోగతికి దోహదపడాలి. అంతేతప్ప%ా% ప్రజావ్యతిరేక విధానాలను తెచ్చి, కార్మికవర్గాన్ని, సామాజిక న్యాయాన్ని బలి చేయకూడదు.

# సున్నపుగుట్ట తండాలో రాత్రికి రాత్రే అక్రమ లేఅవుట్లు

**కదిరి, పతాకం న్యూస్:** రూరల్ పరిధిలోని సున్నపుగుట్ట తండాలో రాత్రికి రాత్రే అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. జాతీయ రహదారికి సమీపంలో ఉదయానికే అక్రమ లేఅవు ట్ సిద్ధ మైంది. ఎటువంటి అనుమతులు లేకుండానే రాళ్లు పాతి, ప్లాట్లు వేశా రు. అనధికారికంగా అగ్రిమెంట్లపై అమ్మకాలు కూడా జరిగినట్లు సమాచారం. అక్రమ లేఅవుట్లను అనుమతించవద్దని ఎమ్మెల్యే కందికుం ట వెంకటప్రసాద్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికారులను హె చ్చరిస్తున్నారు. అయినా సున్నపుగుట్టతండాలో అక్రమ లేఅవుట్‌పై అధి కారుల చర్యలు శూన్యం. తూతూమంత్రంగా శనివారం అధికారులు అ లా వచ్చి ఇలా పరిశీలించి, సత్యసాయిబాబా జయంతి పనులున్నాయంటూ అక్కడినుంచి వెళ్లి పోయారు. కదరి రూరల్ పరిధిలోని కుమ్మర వాండ్లపల్లి పంచాయతీలో ఉన్న సున్నపు గుట్టతండా సమీపం లో హైవేకి పక్కనే దాదాపు రెండు ఎకరాల్లో అక్రమ లేఅవుట్లు వెలిశాయి. గత రెండురోజుల నుంచి అక్కడ చదును చేసే పనులు జరుగగా శనివారం ఉదయానికల్లా ప్లాట్లలో నాటిన రాళ్లు కనిపించాయి. ప్రస్తుతానికి అక్కడ సెంటు రూ. 13లక్షల నుంచి 15లక్షలతో ప్లాట్లు వేసి అమ్మినట్లు సమాచారం. ఇప్పటికే పేపర్ లేఅవుట్లలో వీటి అమ్మకాలు మొత్తం జరిగినట్లు తెలిసింది. చివరగా ప్లాట్లు కొనుగోలు చేసిన యజ మానులకు ప్లాట్లు చూపించేందుకు ఆ భూమిలో రాళ్లు పాతి ప్లాట్లు విభజించారు. వీటిని ఆయా స్థల యజమానులకు కూడా చూపించినట్లు తెలిసింది. అక్రమ లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోం ది. అక్రమ లేఅవుట్లలో భవనాలు నిర్మిస్తే వాటికి రోడ్లు, కాలువలు, తాగునీరు తదితర స్థానిక సమస్యలు భరించాల్సి ఉంటుంది. అక్రమ లేఅవుట్లు వేసిన యజమానులు మాత్రం స్థలం



కొనుగోలు చేసివారికి కేవలం పేపర్ మీదే ప్లాట్లు చూపించి అమ్మివేసి, సొమ్ముచేసుకుంటున్నారు. సున్నపుగుట్టతండాలో ఏర్పాటైన ఈ అక్రమ లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# జీవో నెం.23ను వెంటనే రద్దు చేయాలని ధర్నా



**కాకినాడ, పతాకం న్యూస్:** 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సెప్టెంబర్ 19న అసెంబ్లీలో చట్టం చేసి జారీచేసిన జీవో నెంబర్ 23ను రద్దు చేయాలని, కార్మికుల ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్టియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జీవో నెంబర్ 23 రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఆప్కాస్ లో ఉన్న కార్మికులు ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, అంగన్వాడి, ఆశా, మిడ్ డే మీల్ వంటి స్కీం రంగాల ఉద్యోగులనఅు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రతి కార్మికుడికి, కాంట్రాక్ట్ ఉద్యోగికి, నెలకు 26 వేల రూపాయలు జీతం చెల్లించాలని, బిఓసి బోర్డు పథకాల అమలు చేయాలని ఐఎఫ్టియు డిమాండ్ చేసింది. ప్రభుత్వాలు వాడుకున్న నిధులను పిఓసి బోర్డుకి జమ చేయాలని, ఆటో, మోటార్, హమాలీ రంగాలకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, అందులో తొలగించిన 5400 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, గూగుల్ డేటా వంటి పర్యావరణ వ్యతిరేక పరిశ్రమలకు అనుమతులు నిరాకరించాలని, కార్పొరేట్ కంపెనీలకు విచ్చలవిడిగా రాయితీలు, ఉచిత భూములు కట్ట పెట్టడానికి ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా సాగింది.

ఈ ధర్నాను ఉద్దేశించి ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగాను, అధికారం కోల్పోతే మరో రకంగాను వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. 138 సంవత్సరాల మేడే పోరాట స్ఫూర్తితో ప్రాణ త్యాగాలతో, రక్త తర్పణలతో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని 10 గంటలు చేయడం దుర్మార్గమని విమర్శించారు. చంద్రబాబు నాయుడు చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని హెచ్చరించారు. కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రజా వ్యతిరేక విధానాలు, రైతు వ్యతిరేక విధానాలు మానుకోకపోతే రాబోయే కాలంలో కార్మిక పోరాటాలతో సమాధానం చెబుతాం అంటూ హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి గుబ్బల ఆదినారాయణమూర్తి రాష్ట్ర నాయకులు రాగుల రఘువులు, రాఘవ, ఎల్లారావు, నాగేశ్వరరావు, రాంబాబు, రాజు, సత్తిబాబు, శ్రీను, చిన్న, శ్రీకాంత్, మహేష్, వెంకన్న శ్రీను, శివ,పేతురు, రాము, లోవరాజు, యశోద,మంగ తదితరులు పాల్గొన్నారు.

# రోజంతా కళ్లద్దాలు పెట్టుకోవటం మంచిదేనా?

## అధ్యయనాలు ఏం చెబుతున్నాయంటే!

శరీరంలోని సున్నితమైన అవయవాల్లో 'కళ్లు' ముఖ్యమైనవి. అవి ఆరోగ్యంగా ఉంటేనే, రోజూ ప్రపంచాన్ని చూడగలుగుతాం. మరి, ఇంతటి అమూల్యమైన చూపును ప్రసాదించే కళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించలేకపోతున్నాం. ఎందుకంటే, కళ్ల గురించి, చూపును దెబ్బతీసే అంశాల గురించి చాలా మందికి సరైన అవగాహన లేక పోవడమే. పైగా ఎన్నెన్నో అపోహలూ రాజ్యమేలుతున్నాయి. ఈ క్రమంలో కంటి చూపుపై ఉన్న అపోహలు, వాటి వెనకున్న వాస్తవాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

తక్కువ వెలుతురులో చదివితే చూపు తగ్గిపోతుందని చాలా మంది అనుకుంటుంటారు. ఇది వాస్తవం కాదు. మసక వెలుతురులో చదవడం వల్ల కళ్లు అలసిపోయినట్లు అనిపించవచ్చు, కానీ అది హానికరం కాదని అధ్యయనం పేర్కొంది. కాబట్టి, పుస్తకం మీద నేరుగా వెలుతురు పడేలా లైటును అమర్చుకొని చదువుకోవడం మంచి పద్ధతి అని సూచిస్తున్నారు. కంటి ఆరోగ్యానికి క్యారెట్లను మించినవి లేవనేది కొంతమంది భావన. ఆరోగ్యకరమైన కంటి చూపును నిర్వహించడానికి శరీరానికి విటమిన్ ఎ చాలా అవసరం. క్యారెట్లలో ఈ పోషకం అధిక మొత్తంలో ఉంటుంది. కానీ శరీరానికి దృష్టికి విటమిన్ ఎ చాలా తక్కువ మొత్తంలో మాత్రమే అవసరమని అధ్యయనం పేర్కొంది . దీనిని ముదురు ఆకుకూరలు, ముదురు రంగు కూంగాయలు, పాలు, చేపలు వంటి అనేక వనరుల ద్వారా పొందవచ్చని తెలిపింది. విటమిన్ ఎ అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల కంటి చూపును కాపాడుకోవచ్చని, కానీ అది దృష్టిని మెరుగుపరచదు లేదా అద్దాలు లేదా కాంటాక్ట్ లెన్సులు అవసరం రాకుండా చేస్తుందని



చెబుతుంది. ఇవి వయసుతో పాటు దాడిచేసే శుక్లాలు, రెటీనా మధ్యభాగం క్షీణించటం వంటి సమస్యల బారినపడకుండానూ కాపాడతాయంటున్నారు నిపుణులు.

కాంటాక్ట్ లెన్సులు లేదా కళ్లద్దాలను రోజంతా పెట్టుకోవటం మంచిది కాదని, దీంతో కళ్లు వాటికి అలవాటు పడిపోతాయనేది మరికొందరి అపోహ. ఇందులో ఏ మాత్రం నిజం లేదంటున్నారు నిపుణులు. హ్రస్వదృష్టి , దూరదృష్టి , ఆస్టిగ్మాటిజం లేదా ప్రెస్బియోపియాను సరిచేయడానికి ధరించే కళ్లద్దాలు కళ్లను బలహీనపరచవని అధ్యయనం పేర్కొంది. మామూలుగా వయసు మీద పడటం, జబ్బుల మూలంగానో కంటి అద్దాల పవర్ మారుతుంటుందని తెలియజేస్తున్నారు. అప్పుడు కొత్త అద్దాలు తీసుకోవాల్సి వస్తుందని వివరిస్తున్నారు. అంతే తప్ప కళ్లద్దాలు, లెన్సులతో చూపు తగ్గటం, కళ్లు దెబ్బతినటం వంటి ముప్పులేవీ ఉండవని పేర్కొంటున్నారు. సరైన కళ్లద్దాలు ధరించడం వల్ల కూడా కంటి ఒత్తిడి తగ్గుతుందని %ఔఝంస్త్రబ వీవసఱఅషఱఅవ% అధ్యయనం పేర్కొంది.

అదే పనిగా కంప్యూటర్ వైపు చూడటం కళ్లకు ప్రమాదకరమని ఇంకొందరు భావిస్తుంటారు. అయితే ఇది నిజం కాదని, స్క్రీన్ వైపు గంటలకొద్దీ చూడటం వల్ల కళ్లు అలసిపోవటం, ఒత్తిడికి లోనవటం సహజమే గానీ చూపేమీ దెబ్బతినదని నిపుణులు అంటున్నారు. అయితే, ఎక్కువసేపు కంప్యూటర్ ముందు కూచోవాల్సి వస్తే 20-20-20 సూత్రాన్ని పాటించాలని సూచిస్తున్నారు. ఎలాగంటే, ప్రతి 20 నిమిషాలకు ఒకసారి 20 సెకండ్ల పాటు 20 అడుగుల దూరంలోని దృశ్యాలను చూడటం అలవాటు చేసుకోవాలని చెబుతున్నారు. అలాగే తరచుగా కంటి రెప్పలను ఆడిస్తూ ఉండాలని సలహా ఇస్తున్నారు. దీంతో కళ్లు పొడిబారకుండా చూసుకోవచ్చని పేర్కొంటున్నారు. కంటి వ్యాయామాలు చేస్తే కళ్లద్దాలు ధరించాల్సిన అవసరం ఉండదని కొందరు అనుకుంటుంటారు. కంటి వ్యాయామాలతో కంటి కండరాలు బలోపేతం అవుతాయని, కానీ తగ్గిపోయిన చూపు తిరిగి మామూలు స్థాయికేమీ రాదంటున్నారు నిపుణులు. కంటి ఆకృతి, కంటి కణజాలం వంటి వ్యాయామాలతో మారిపోవని తెలియజేస్తున్నారు. కంటి వ్యాయామాలు దృష్టిని మెరుగుపరచడం లేదా సంరక్షించడం లేదా అద్దాల అవసరాన్ని తగ్గించడం వంటివి జరగవని %ూవవతీఱఖుఱ ాఖుసవఎఎ శీట రాజూవ్త్ర ష్ఠుఖుశ్రీఎశీశ్రీశీస్త్రఎ% అధ్యయనం పేర్కొంది.


ఈ క్రమంలో చూపు తగ్గటాన్ని ఎవరు ఆపలేరని కొంతమంది అనుకుంటుంటారు. కానీ చూపు మసకబారటం, కంటి నొప్పి, మిరుమిట్లు గొలిపే కాంతులు మెరవటం వంటి లక్షణాలు కనబడితే వెంటనే డాక్టర్?ను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. కారణాన్ని వీలైనంత త్వరగా గుర్తిస్తే తగు చికిత్సలతో సరి చేయొచ్చని అంటున్నారు. కనీసం చూపు తగ్గటాన్నయినా నెమ్మదింపజేయొచ్చని తెలియజేస్తున్నారు.



# కుచ్చులు కుచ్చులుగా జుట్టు రాలుతోందా..?

ఈ రోజుల్లో జుట్టు రాలే సమస్యతో ఎంతో మంది బాధపడుతున్నారు. అయితే, కొంతమందిలో సడెన్‌గా కుచ్చుకుచ్చులగా రాలిపోతూ ఉంటుంది. దీనికి చాలా కారణాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎంతో మందిని వేధిస్తున్న సమస్య జుట్టు రాలడం. రోజుకు 50 నుంచి 100 వెంట్రుకలు రాలడం సహజం. కానీ, కొంతమందికి జుట్టు సడెన్‌గా కుచ్చు కుచ్చులుగా జుట్టు రాలుతూ ఉంటుంది. తలలో చేయి పెట్టడం పాపం.. జుట్టు ఊడి చేతికి వచ్చేస్తుంటుంది. జుట్టు ఇలా రాలుతూ ఉంటే.. చాలా బాధగానే ఉంటుంది. అమ్మాయిలే కాదు.. అబ్బాయిలు హెయిర్ ఫాల్ సమస్యతో ఇబ్బంది పడుతూ ఉంటారు. జుట్టు రాలే సమస్య ఎక్కువగా ఉంటే.. జుట్టు పలుచగా, నుదురు బయటకు కనిపిస్తూ.. అందవిహీనంగా మారుతుంది. ఆకస్మికంగా జుట్టు రాలడానికి కారణాలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం. జుట్టు రాలడానికి ప్రధాన కారణాలలో పోషకలోపం ఒకటి. శరీరారనికి తగినంత విటమిన్లు, మినరల్స్, ప్రొటీన్లు లభించనప్పుడు పోషకలోపం ఎదురవుతుంది. ముఖ్యంగా శరీరంలో ప్రొటీన్లు, బయోటిన్, జింక్, ఐరన్, విటమిన్ బీ12, విటమిన్ వంటి పోషకాల లోపం కారణంగా.. అకస్మాత్తుగా హెయిర్ ఫాల్ సమస్య ఎదురవుతుంది. శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఉంటే.. అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. %ూజూూ%, మెనోపాజ్, డయాబెటిస్, అధిక బరువు వంటి హార్మోన్ల అసమతుల్యత సడెన్ హెయిర్ ఫాల్‌కు కారణం కావచ్చు. హార్మోన్ల అసమతుల్యత జుట్టు నిర్మాణ కణజాలాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మీరు హార్మోన్ల అసమతుల్యతతో బాధపడుతుంటే.. మీ డైట్‌లో తాజా పండ్లు, కూరగాయలు, నట్స్, తృణధాన్యాలు ఎక్కువగా చేర్చుకోండి. కొన్ని రకాల మెడిసిన్స్ హెయిర్ ఫాల్‌కు కారణం అవుతాయి. ముఖ్యంగా బ్లడ్ థినర్స్, యాంటీ డిప్రెసెంట్స్, కొలెస్ట్రాల్ తగ్గించే మెడిసిన్స్ వాడేవారిలో హెయిర్ ఫాల్ సమస్య ఎక్కువగా ఉంటుంది. కొన్ని ఆటో ఇమ్యూన్ వ్యాధుల కారణంగా జుట్టు ఎక్కువగా రాలుతూ ఉంటుంది. అలోపేసియా, లూపస్ ఆటో ఇమ్యూన్ వ్యాధులు ఉన్నవారికి హెయిర్ ఫాల్ సమస్య ఎక్కువగా ఉంటుంది. శరీరంలో టెలోజెన్ అనే హార్మోన్ పెరిగితే.. జుట్టు రాలే సమస్య ఎక్కువ అవుతుంది. ఇది హెయిర్ ఫాల్‌కు ప్రధాన కారణం అని నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి ఎక్కువ అయినా.. శరీరంలో దీని ఉత్పత్తి పెరుగుతుంది. ఒత్తిడి కారణంగా.. హెయిర్ ఫాల్‌కు, బట్టతలకి కారణమయ్యే కార్టిసాల్ ఉత్పత్తిని కూడా పెరుగుతుంది. థైరాయిడ్ సమస్య ఉన్నవారికి జుట్టు రాలే సమస్య అధికంగా ఉంటుంది. హైపోథైరాయిడ్, హైపర్ థైరాయిడ్ హెయిర్ ఫాల్ ఎక్కువగా జరుగుతుంది. థైరాయిడ్ గ్రంథి శరీర పనితీరులో కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే, హెయిర్ గ్రోథ్‌లో ముఖ్య పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ హార్మోన్ విడుదలలో అసమతుల్యత కారణంగా జుట్టు ఎక్కువగా రాలుతూ ఉంటుంది.

# అసైన్డ్ చట్ట సవరణ ఎవరి కోసం?



**అమరావతి, పతాకం న్యూస్:** స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రభుత్వాలు దళితులు, బలహీన వర్గాల పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా వున్న 9/77 అసైన్ చట్టాన్ని ఈ నెల 10వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం సవరించింది. ఈ చట్ట సవరణ బడుగు బలహీన వర్గాలకు వరం లాంటిదని, రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన కేంద్రంగా మార్చడంలో పేద రైతులు భాగస్వాములవుతారని, తద్వారా వచ్చే పరిశ్రమలలో పేద రైతుల పిల్లలకు ఉద్యోగాలు లభిస్తాయని, మొత్తంగా పేదరికం లేని రాష్ట్రంగా ఎ.పి ని తీర్చిదిద్దుతామని రెవెన్యూ మంత్రి సెలవిచ్చారు. నిజానికి ఈ సవరణ వల్ల ఎవరికి లాభం? ఎవరికి నష్టం? ఎ.పి ఉమ్మడి రాష్ట్రంలో వివిధ రకాల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు 58 లక్షల ఎకరాలను పేదలకు అసైన్ చేశాయి. విభజిత ఆంధ్ర రాష్ట్రంలో 33 లక్షల 50 వేల ఎకరాలు పంపిణీ చేసినట్లు ప్రభుత్వ లెక్కలు తెలియజేస్తున్నాయి. పేదలకు ఇచ్చిన ఈ భూములను పెత్తందారులు, పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు పేదలకు పావలో, పాతికో ఇచ్చి లేదా అదిరించి బెదిరించి లాక్కుంటున్నారు. అయితే పేదలకిచ్చిన భూములు పేదలే అనుభవించాలి. అన్యాక్రాంతం చేయడానికి వీలు లేదు. అనర్హులు కొనడానికి వీలు లేదు. ఒకవేళ దౌర్జన్యంగా ఆక్రమించినా శిక్షార్హులని అసైన్‌మెంట్ సెక్షన్ 6 చెబుతున్నది. 1977లో పేదల కోసం పట్టుబట్టి పేదల ఆశాజ్యోతి ఎస్.ఆర్.శంకరన్ ఈ చట్టాన్ని తెచ్చారు. పేదల భూములకు రక్షణ కవచంగా ఉన్న ఈ చట్టాన్ని గత 20 సంవత్సరాల నుండి రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ వచ్చాయి. దీనికి పరాకాష్టగా కూటమి ప్రభుత్వం గుండెకాయ లాంటి క్లాజుని సవరించింది. ఈ సవరణ వల్ల ఇప్పటికే అక్రమంగా, దౌర్జన్యంగా అనుభవిస్తున్న పెత్తందారులకు 99 సంవత్సరాల లీజు పేరుతో భూములను కట్టబెట్టేందుకు పూనుకుంది. 1990కి ముందు మన దేశంలో వామపక్ష పార్టీల పోరాటాలతో పేదల చేతికి భూములు వచ్చాయి. వామపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలలో మాత్రమే భూసంస్కరణ చట్టాలు అమలు జరిగి పేదల చేతులలోకి కొద్దో గొప్పో భూములు వచ్చాయి. నాడు పేదలకు అనుకూలంగా భూ సంస్కరణలు, చట్టాలు వస్తే%ొ%1990 అనంతరం నూతన ఆర్థిక విధానాలతో పేదల భూములను పెద్దలకు కట్టబెట్టడానికి తిరోగమన సంస్కరణలు తెచ్చి%ొ%అభివృద్ధి అనే ముద్దు పేరుతో పేదల భూములను కార్పొరేట్లు, బడా పెట్టుబడుదారులకు లక్షల ఎకరాలు ధారాదత్తం చేస్తున్నాయి 'డబుల్ ఇంజన్' ప్రభుత్వాలు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో 9/77 అసైన్ చట్టాన్ని సవరించారు.

మన రాష్ట్రంలో సుమారు 26 లక్షల కుటుంబాలకు 33 లక్షల 50 వేల ఎకరాలను పేదలకు ప్రభుత్వాలు పంచినట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. అయితే పేదలకు ఇచ్చిన ఈ భూముల్లో ఎక్కువ శాతం పెత్తందారులు, రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన వారి చేతుల్లోకి పోయినట్లు గతంలో కోనేరు రంగారావు భూకమిటీ చెప్పింది. ఇదే విషయాన్ని గత వైసిపి ప్రభుత్వం, నేటి టిడిపి కూటమి ప్రభుత్వాలు సైతం పలుమార్లు ప్రకటించాయి.

పేదలకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూములు 20 సంవత్సరాల తర్వాత అమ్మకాలు, కొనుగోలు చేయవచ్చని గత వైసిపి ప్రభుత్వం అసైన్ చట్టాన్ని సవరించింది. ఆ సమయంలో సుమారు 7 లక్షల ఎకరాలను అనర్హులు అక్రమంగా క్రమబద్ధీకరించుకున్నట్లు టిడిపి కూటమి ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను గుర్తించి, ఆక్రమించిన వారికి శిక్ష విధించి, తిరిగి పేదలకు పంపిణీ చేస్తామని 2024 మే లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు వాగ్దానం చేశారు. తీరా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు సార్లు రెవెన్యూ సదస్సులు పెట్టి కోట్ల రూపాయలు ఖర్చు చేసిందిగాని, ఒక్క ఎకరం కూడా పేదలకు పంచలేదు. భూ సమస్యలను అధ్యయనం చేయడానికి 2025 మార్చిలో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించారు. ఈ కమిటీ సుమారు 8 నెలలపాటు కసరత్తు చేసి అక్టోబర్ 7న సమావేశమై, త్వరలోనే రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెబుతామని ప్రకటించారు. రకరకాల పేర్లతో భూములు కోల్పోయిన పేదలందరూ ఈ ప్రకటన చూసి సంతోషించారు. తిరిగి పెత్తందారుల నుండి తమ భూములను ప్రభుత్వం తిరిగి వెనక్కి ఇప్పిస్తుందని ఆనందపడ్డారు. చావు కబురు చల్లగా చెప్పినట్లు టిడిపి కూటమి ప్రభుత్వం ఈనెల 10వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా ఉన్న అసైన్డ్ చట్టాన్ని సవరించి దళితులకు, బలహీన వర్గాల పేదల ఆశలపై నీళ్లు చల్లింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో అక్రమంగా దౌర్జన్యంగా పేదల నుండి ఆక్రమించుకున్న పెత్తందారులకే 99 సంవత్సరాలు లీజుకు ఇవ్వడానికి చట్టాన్ని సవరించింది.'అసైన్‌మెంట్ భూములు పేదల చేతులలోనే ఉండాలి. ఎట్టి పరిస్థితులలో అమ్మకాలు, కొనుగోలు చేయరాదు. భూబదలాయింపు నిషేధం' అన్న ఫ్రీహోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి%ొ% అనర్హులకు రాజమార్గం ద్వారా భూములను కట్టబెట్టడానికే కూటమి ప్రభుత్వం ఈ చట్టాన్ని సవరించింది. తద్వారా 26 లక్షల దళిత, బలహీన వర్గాల పేదలకు తీవ్ర ద్రోహం చేసింది.

# మస్క్ సంచలనం.. రోబోలతో సెలబ్రేషన్



**అమెరికా:** ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు ఎలాన్ మస్క్ మరోసారి రికార్డు సృష్టించారు. కంపెనీ చరిత్రలోనే అత్యధిక జీతం అందుకునే సీఈవోగా ఆయన పేరు నమోదైంది. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో జరిగిన టెస్లా వార్షిక సర్వసభ్య సమావేశంలో మస్క్‌కు ట్రిలియన్ డాలర్ల పే ప్యాకేజ్‌ను షేర్ హోల్డర్లు ఆమోదించారు. దీంతో మస్క్ సంబరాలు అంబరాన్నంటాయి. కంపెనీ తయారు చేసిన హ్యూమనాయిడ్ రోబోలతో కలిసి హుషారుగా డ్యాన్స్ చేస్తూ మస్క్ ఎంజాయ్ చేశారు. ఆ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

మస్క్‌కు ట్రిలియన్ డాలర్ల పే ప్యాకేజీ అందాలంటే ఆయన ముందు కొన్ని టార్గెట్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టెస్లా మార్కెట్ విలువ 1.4 ట్రిలియన్ల డాలర్లుగా ఉన్నది. అయితే ఆ మార్కెట్ విలువను ఆయన 8.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాల్సి ఉంటుంది. స్వీయ డ్రైవింగ్ చేస్తున్న లక్షల సంఖ్యలో రోబో ట్యాక్సీ వాహనాలను ఆయన కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకుట్లే సాగితే, ప్రపంచ కుబేరుడు మస్క్ ప్రపంచంలోనే తొట్టతొలి ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్‌ను పూర్తిగా డామినేట్ చేస్తూ వేగంగా పెరగాల్సిన టార్గెట్ మస్క్ ముందుంది.




# దిగజారిన టీమిండియా ర్యాంక్



దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ క్రికెట్ జట్టు ఓటమితో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి) పాయింట్ల పట్టికలో మార్పులు సంభవించాయి. తొలి టెస్టులో గెలిచిన సౌతాఫ్రికా లో ఐదో స్థానం నుంచి రెండో ప్లేస్‌కు ఎగబాకింది. ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడిన సఫారీలు రెండింట గెలిచి ఒక దాంట్లో ఓడిపోయారు. ప్రస్తుతం ఆ జట్టు విజయాల శాతం (66.67)గా ఉంది. ఇక, తొలి టెస్టులో ఓటమి చవిచూసిన టీమ్‌ఇండియా మూడో స్థానం నుంచి నాలుగో ప్లేస్ (విజయాల శాతం 54.17)కు పడిపోయింది. ఈ డబ్ల్యూటిసిలో ఇప్పటి వరకూ భారత్ ఎనిమిది మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 3 ఓటములు, ఒక మ్యాచ్ డ్రాగా ముగించింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలిచిన ఆస్ట్రేలియా (100.00 శాతం) అగ్రస్థానంలో కొనసాగుతోంది. రెండు మ్యాచ్‌ల్లో ఒక విజయం, ఒక డ్రాతో ఉన్న శ్రీలంక (66.67) మూడో స్థానంలో ఉంది. పాకిస్థాన్ (50.00), ఇంగ్లాండ్ (43.33), బంగ్లాదేశ్ (16.67) వరుసగా ఐదు, ఆరు, ఏడు స్థానాల్లో ఉన్నాయి. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన వెస్టిండీస్ ఎనిమిదో ప్లేస్‌లో ఉంది. న్యూజిలాండ్ ప్రస్తుత డబ్ల్యూటిసిలో ఇంకా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు.

## దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టెస్టులో

# టీమిండియా ఘోర పరాజయం



గత ఏడు టెస్టుల్లో ఆరు పరాజయాలు. గత 15 ఏండ్లలో భారత గడ్డపై ఒక్క టెస్టు విజయం సాధించలేదు. తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల వెనుకంజ. అయినా, ఈడెన్‌గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా అద్భుతం చేసింది. 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని విజయవంతంగా కాపాడుకుంది. ఆతిథ్య భారత్‌కు స్పిన్ స్ట్రోక్ ఇచ్చి.. 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఛేదనలో భారత్ 93 పరుగులకే కుప్పకూలింది. రెండు టెస్టుల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0తో ముందంజ వేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల ఆధిక్యం సాధించిన భారత్.. 30 పరుగుల తేడాతో మ్యాచ్‌లో ఓటమి చవిచూసింది.కోల్‌కతా : ఈడెన్‌గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా అద్భుతం చేసింది. ఆఫ్ స్పిన్నర్ సైమన్ హార్మర్ (4/21), లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (2/37), పేసర్ మార్కో యాన్సెన్ (2/15) మ్యాజిక్‌తో భారత్‌తో తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 30 పరుగుల తేడాతో మెరుపు విజయం సాధించింది. 124 పరుగుల ఛేదనలో భారత్ 35 ఓవర్లలో 93 పరుగులకు కుప్పకూలింది. వాషింగ్టన్ సుందర్ (31, 92 బంతుల్లో 2 ఫోర్లు), అక్షర్ పటేల్ (26, 17 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు), రవీంద్ర జడేజా (18, 26 బంతుల్లో 2 ఫోర్లు) మెరిసినా.. భారత్‌ను ఓటమి నుంచి తప్పించలేదు. అంతకుముందు తెంబ బవుమా (55 నాటౌట్, 136 బంతుల్లో 4 ఫోర్లు) వీరోచిత అర్థ సెంచరీతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 153 పరుగులు చేసింది. టెయిలెండర్ కార్బిన్ బాచ్ (25, 37 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మ్యాచ్‌ను మలుపు తిప్పే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. ఎనిమిది వికెట్లతో మాయ చేసిన సైమన్ హార్మర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

భారత్ లక్ష్యం 124 పరుగులు. సఫారీ శిబిరంలో ఇద్దరే స్పిన్నర్లు. తొలి ఇన్నింగ్స్‌లో కేశవ్ మహరాజ్ పెద్దగా ప్రభావం చూపించలేదు. పిచ్ బ్యాటింగ్‌కు కఠినంగా మారినా.. మనోళ్లు కొట్టేస్తారనే దీమా. కానీ పేసర్ యాన్సెన్ కొత్త బంతితో ఓపెనర్లు ఇద్దరినీ సాగనంపి భారత ఆత్మవిశ్వాసం దెబ్బతీశాడు. జైస్వాల్ (0), రాహుల్ (1) వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించారు. ధ్రువ్ జురెల్ (13), రిషబ్ పంత్ (2)లను సైమన్ హార్మర్ వెనక్కి పంపాడు. 38/4తో పీకల్లోతు కష్టాల్లో కూరుకున్న భారత్‌ను వాషింగ్టన్ సుందర్ (31), రవీంద్ర జడేజా (18) ఆదుకునే ప్రయత్నం చేశారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 26 పరుగులు జోడించి ఆశలు రేకెత్తించింది. సుందర్ క్రీజులో పాతుకుపోగా.. జడేజా స్కోరు బోర్డుకు ముందుకు నడిపించాడు. కానీ జడేజాను హార్మర్.. మార్క్రామ్ మాయకు సుందర్ పడిపోయారు. 72/6తో భారత్ ఓటమి కోరల్లో చిక్కుకుంది. ఈ సమయంలో అక్షర్ పటేల్ (26)పైనే ఆశలు నెలకొన్నాయి. కేశవ్ మహరాజ్‌పై ఎదురుదాడి చేసిన అక్షర్ పటేల్.. ఓ ఫోర్, రెండు సిక్సర్లు బాదాడు. అదే ఓవర్లో మరో సిక్సర్‌కు ప్రయత్నించి బవుమాకు క్యాచ్ ఇచ్చాడు. సిరాజ్ తొలి బంతికే నిష్క్రమించగా 35 ఓవర్లలో భారత్ 93 పరుగులకు కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో స్వీప్ షాట్ ఆడుతూ మెడ గాయానికి గురైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఛేదనలో బ్యాటింగ్‌కు రాలేదు. గాయం తీవ్రత దృష్ట్యా గిల్‌ను ఆసుపత్రికి తరలించారు.

ఓవర్‌నైట్ స్కోరు 93/7తో మూడో రోజు ఉదయం బ్యాటింగ్‌కు వచ్చిన దక్షిణాఫ్రికా.. అప్పటికి 63 పరుగుల ముందంజలోనే నిలిచింది. చివరి మూడు వికెట్లను త్వరగా పడగొడితే.. భారత్ రెండెంకల లక్ష్యాన్ని ఛేదించే అవకాశం ఉండేది. కానీ ఉదయం సెషన్‌ను అక్షర్ పటేల్ బౌలింగ్‌తో మొదలెట్టిన బారత్.. రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌లను ప్రయోగించింది. తొలి రెండు రోజులు గొప్పగా మాయ చేసిన స్పిన్నర్లు.. మూడో రోజు తేలిపోయారు. జడేజా 7 ఓవర్లలో 21 పరుగులు సమర్పించుకున్నాడు. కుల్‌దీప్ యాదవ్‌ను టెయిలెండర్ కార్బన్ బాచ్ లక్ష్యంగా చేసుకుని బౌండరీలు బాదాడు. అక్షర్ పటేల్ ఒత్తిడి పెంచలేకపోయాడు.




# 27న 'ఆంధ్రాకింగ్'



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్రాకింగ్' విడుదల తేదీలో మార్పు చోటు చేసుకుంది. ఈ సినిమాను ముందుగా ప్రకటించిన తేదీ కంటే ఒక రోజు ముందుగానే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించింది.

మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నవంబర్ 28న విడుదల చేయనున్నట్లు గతంలో తెలిపారు. అయితే, తాజాగా విడుదల తేదీలో మార్పు చేస్తూ నవంబర్ 27నే థియేటర్లలోకి తీసుకువస్తున్నట్లు కొత్త పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఈ సినిమాలో రామ్ సరసన భాగ్యశ్రీ భోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రముఖ నటుడు ఉపేంద్ర ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు.

అనుకున్న తేదీ కంటే ఒక రోజు ముందుగానే సినిమా విడుదల కానుండటంతో రామ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా వరుస పరాజయాలతో సతమతమవుతున్న రామ్, ఈ సినిమాతో తప్పకుండా విజయం సాధించాలని పట్టుదలగా ఉన్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను భారీగా పెంచాయి. ఈ నేపథ్యంలో రామ్ కెరీర్‌కు ఈ చిత్రం ఎంతో కీలకంగా మారింది.

## హీరోల్లా మేమెందుకు చేయకూడదు?

# నటి కామాక్షి



అల్లరి నరేశ్, కామాక్షి భాస్కర్ల జంటగా నటించిన చిత్రం '12ఎ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కామాక్షి భాస్కర్ల సినిమా విశేషాలను పంచుకున్నారు.

ఈ చిత్రం మంచి ప్రేమకథతో కూడిన ఒక బిగువైన కథనంతో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ అని ఆమె తెలిపారు. "తర్వాత ఏం జరుగుతుందోనన్న ఆసక్తిని రేకెత్తిస్తూ సినిమా సాగుతుంది. ఇందులో నేను ఆరాధన అనే పాత్రలో కనిపిస్తాను. ఈ పాత్ర లేకపోతే ఈ కథే లేదు. సినిమా చూసిన తర్వాత ప్రతి ఒక్కరికీ నా పాత్ర గుర్తుండిపోతుంది" అని కామాక్షి ధీమా వ్యక్తం చేశారు.

తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ .. విజయ్ సేతుపతి, శ్రీవిష్ణు, సుహాస్ వంటి హీరోలు అన్ని రకాల పాత్రలు చేస్తున్నారని, హీరోయిన్లు కూడా అలా ఎందుకు చేయకూడదని తాను సవాల్‌గా తీసుకుని విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటున్నానని తెలిపింది. గత ఐదేళ్లలో 'విరూపాక్ష', 'పొలిమేర' వంటి చిత్రాలు తనకు మంచి పేరు తెచ్చిపెట్టాయని పేర్కొంది.




# అదొక చేదు అనుభవం: మంచు లక్ష్మి



నటి, నిర్మాత మంచు లక్ష్మి తన జీవితంలో జరిగిన ఓ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. 15 ఏళ్ల వయసులో పబ్లిక్ బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు తనకు లైంగిక వేధింపులు ఎదురయ్యాయని, ఆ భయంకర ఘటన తనను ఇప్పటికీ వెంటాడుతోందని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. సెలబ్రిటీ కుటుంబం నుంచి వచ్చిన తనకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, సామాన్య మహిళల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందోనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నప్పుడు తాను ఎప్పుడూ సొంత వాహనంలోనే ప్రయాణించేదాన్నని, బాడీ గార్డులు ఉండేవారని లక్ష్మి గుర్తుచేసుకున్నారు. అయితే, పరీక్షల హాల్ టికెట్ల కోసం స్కూల్ యాజమాన్యం విద్యార్థులను పబ్లిక్ బస్సులో తీసుకెళ్లిందని వెల్లడించారు. అదే తన మొదటి బస్సు ప్రయాణమని, ఎంతో ఉత్సాహంగా ఉన్న సమయంలో ఓ వ్యక్తి తనను అసభ్యంగా తాకడంతో షాక్‌కు గురయ్యానని ఆమె తెలిపారు.

ఆ క్షణంలో ఏం జరిగిందో కూడా తనకు అర్థం కాలేదని, భయంతో వణికిపోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం స్నేహితులతో పంచుకున్న తర్వాత కాస్త ధైర్యం వచ్చిందన్నారు. రోజూ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో ప్రయాణించే మహిళలు ఇలాంటి ఎన్నో అవమానాలను ఎదుర్కొంటూ మౌనంగా భరిస్తున్నారని ఆమె అన్నారు. ఎంతో మంది మహిళలు తమకు ఎదురయ్యే వేధింపుల గురించి బయటకు చెప్పుకోలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నారని మంచు లక్ష్మి పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం సమాజం బాధ్యత తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆమె పిలుపునిచ్చారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**